ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 19 ఫిబ్రవరి 2025



రాయి క్వారీల్లో విజిలెన్స్ తనిఖీలు

- మూడు లారీలు సీజ్

అనకాపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో నల్లరాయి క్వారీల్లో గనుల శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సరైన బిల్లులు లేని మూడు లారీలను సీజ్ చేశారు. మరో రెండు వాహనాల్లో రాయి నిల్వలు అధికంగా ఉండడంతో రూ.52 వేలు అపరాధ రుసుం విధించారు. గనుల శాఖ విజిలెన్స్ అధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.

ప్రభుత్వ భూముల్లో పాగా!

మారేడుపూడి రెవెన్యూ పరిధిలో యథేచ్ఛగా ఆక్రమణలు

- దర్జాగా పక్కా ఇళ్ల నిర్మాణం
- కబ్జాదారులకు కూటమికి చెందిన ఓ పార్టీ నేత దన్ను
- ఈపీడీసీఎల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి విద్యుత్ కనెక్షన్లు మంజూరు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపణ



గోపాలపురంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న భవనాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అక్రమణదారుల చెర నుంచి ప్రభుత్వ భూములను విడిపించి, భూములు లేని నిరుపేదలకు పంచాలని ఒకవైపు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా.. మరోవైపు పలు మండలాల్లో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారు. అనకాపల్లి మండలంలో జాతీయ రహదారికి సమీపంలో కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న మారేడుపూడి రెవెన్యూ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

అనకాపల్లి మండలం మారేడుపూడి రెవెన్యూ పరిధిలోని గోపాలపురంలో ప్రభుత్వ భూములను చాలా వరకు గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా భూములను స్వాధీనం చేసుకొని పేదలకు కేటాయిస్తారని స్థానికులు భావించారు. కానీ ఇంతవరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. పైగా వైసీపీ నేతలు ఆక్రమించుకోగా మిగిలిన భూములు, స్థలాలను కూటమి పార్టీల నేతలు ఆక్రమించుకుంటున్నారు. చెరువులను సైతం వదలడంలేదు. గోపాలపురంలోని 133 సర్వే నంబరులో గెడ్డపోరంబోకు, 134లో పోరంబోకు, 135లో బంధ, 136లో గయాలు, 137 సర్వే నంబరులోని గెడ్డవాగులను ఆక్రమించుకున్నారు. వీరిలో కొంతమంది పక్కా భవనాలు కూడా నిర్మిస్తున్నారు. మరికొందరు స్థలం చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి, రేకుల షెడ్లు వేయించి సెంట్లు చొప్పున అమ్ముకుంటున్నారు. కూటమిలో ఒక పార్టీకి చెందిన స్థానిక నాయకుడు ఒకరు ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ఏకంగా విల్లా కట్టుకుంటున్నాడు. అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు కాకముందు ఈ ప్రాంతంలో సెంటు లక్షల రూపాయలకు మించి వుండేది కాదు. జిల్లాల విభజన తరువాత సెంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు పలుకుతున్నది.

అక్రమ నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లు!

మారేడుపూడి రెవెన్యూ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి, ఇళ్ల నిర్మాణం చేపట్టగా, కూటమిలో ఒక పార్టీకి చెందిన నేత బంధువు సిఫారసుతో ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. ఏదైనా స్థలంలో ఇల్లు నిర్మించుకునే ముందు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఈపీడీసీఎల్ అధికారులు సదరు ఇంటి ప్లాన్, ఆధార్ కార్డు, స్థలం పత్రాలను పరిశీలించిన తరువాత తాత్కాలికంగా కనెక్షన్ ఇచ్చి మీటరు బిగిస్తారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత కనెక్షన్‌ను రెగ్యులరైజ్ చేస్తారు. కానీ గోపాలపురంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తున్నారని ఈపీడీసీఎల్ అధికారులను ప్రశ్నిస్తే.. వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. కూటమిలో ఒక పార్టీకి చెందిన ముఖ్య నేత కుటుంబ సభ్యుడు, ఈపీడీసీఎల్ అధికారులపై ఒత్తిడి తెచ్చిమరీ అక్రమ నిర్మాణాలకు సమీపంలో స్తంభాలు వేయించి, ఇళ్లకు విద్యుత్ మీటర్లు బిగిస్తున్నట్టు తెలిసింది.

ఫిర్యాదులను పట్టించుకోని రెవెన్యూ అధికారులు

మారేడుపూడి రెవిన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు, స్థలాల ఆక్రమణ, ఇళ్ల నిర్మాణంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తెర వెనుక కూటమిలో ఒక పార్టీకి చెందిన నేత బంధువు ఉండడమే ఇందుకు కారణమని తెలిసింది. ప్రభుత్వ భూముల కబ్జాపై ఇటీవల కలెక్టర్, తహసీల్దారుకు ఫిర్యాదు చేశామని, కనీసం విచారణ కూడా చేపట్టలేదని కొంతమంది స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏయూ వీసీగా రాజశేఖర్

ఐఐటీ ప్రొఫెసర్‌ను నియమించిన ప్రభుత్వం

- స్వస్థలం కె.కోటపాడు మండలం ఏ.కోడూరు
- తండ్రి ఉద్యోగ రీత్యా సింహాచలంలో స్థిరపడిన కుటుంబం
- విశాఖలోనే విద్యాభ్యాసం
- ఏవీఎన్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఫిల్, పీహెచ్‌డీ
- బోధనలో 27 ఏళ్ల అనుభవం
- 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డు
- విద్యావేత్తల హర్షం

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా ఖరగ్‌పూర్ ఐఐటీలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ఉన్నత విద్యా శాఖ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఏయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్ మూడేళ్లపాటు కొనసాగనున్నారు.

వీసీ పోస్టు కోసం వర్సిటీకి చెందిన సుమారు పది మంది సీనియర్ ప్రొఫెసర్లు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగించారు. అయితే, ఐఐటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. అందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంది. దేశంలోనే పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఏయూ మరో ఏడాదిలో శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతోంది. అంతటి చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయం దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల జాబితాలో చోటుదక్కించుకోవాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్‌ల లక్ష్యం. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుని, అమలు చేయడానికి బయట ప్రొఫెసర్ అయితే బాగుంటుందన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందంటున్నారు. విద్యా బోధనలో కీలక మార్పులు చేయడంతో పాటు పరిశోధనలకు పెద్దపీట వేసే ఆలోచనలో పాలకులు ఉన్నారు.

గడిచిన ఐదేళ్లలో యూనివర్సిటీలో రాజకీయాలు బాగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో బయట నుంచి సీనియర్ ప్రొఫెసర్‌ను తీసుకురావడం ద్వారా వాటన్నింటికీ చెక్ చెప్పడంతో పాటు ... మిగతా 8వ పేజీలో

ఇదీ నేపథ్యం..

నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ స్వస్థలం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఏ.కోడూరు. అయితే కుటుంబం తండ్రి ఉద్యోగరీత్యా సింహాచలంలో స్థిరపడింది. రాజశేఖర్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు సింహాచలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో, ఏడు నుంచి పదో తరగతి వరకూ సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో, ఇంటర్, డిగ్రీ (మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో) ఏవీఎన్ కాలేజీలో చదువుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ (అప్లైడ్ మేథమెటిక్స్), ఎంఫిల్ చేసిన ఆయన.. 1997లో అక్కడే పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రొఫెసర్ రాజశేఖర్‌కు 27 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ఇప్పటివరకూ ఆయన వద్ద 14 మంది డాక్టరేట్ డిగ్రీలు అందుకున్నారు. మరో నలుగురు పీహెచ్‌డీ పూర్తిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆరు పరిశోధన ప్రాజెక్టులు పూర్తిచేశారు. 112 రీసెర్చ్ పబ్లికేషన్స్ వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2002లో యంగ్ సైంటిస్ట్ అవార్డ్ ఇన్ మేథమెటికల్ సైన్సెస్‌ను ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అందించింది. ఈ అవార్డును అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా అందుకున్నారు. వీటితో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అవార్డులను, గోల్డ్ మెడల్స్‌ను రాజశేఖర్ అందుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

ఎక్కడా చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణన్ ఆదేశం
- పోలింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ తరగతులను మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం నియమితులైన పీఓలు, ఏపీఓలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలని అన్నారు. శిక్షణ సమయంలో ఎన్నికల ప్రక్రియ గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని, సందేహాలు ఏమైనా వుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. బ్యాలట్ విధానంలో ఎన్నికలు జరగనున్నందున ఓటు వేయడానికి ఒకింత ఎక్కువ సమయం పడుతుందని, అందువల్ల పోలింగ్ నిర్వహణకు ఎక్కువగా సమయం పట్టే అవకాశం ఉన్నందున ఓపిగ్గా, సంయమనం పాటిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ ... మిగతా 8వ పేజీలో

సూర్య ఘర్‌కు అరకొర స్పందన



సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు ముందుకురాని ప్రజలు

ఇంటి కప్పుపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు

- కేంద్రం 50 శాతం వరకు రాయితీ ఇస్తున్నప్పటికీ అంతంత మాత్రంగానే స్పందన
- జిల్లాలో ఎనిమిది వేల యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం
- ఇంతవరకు 5,855 మంది రిజిస్ట్రేషన్
- డబ్బులు చెల్లించింది 644 మందే!
- 440 మంది ఇళ్లకు సోలార్ యూనిట్లు బిగింపు

నర్సీపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): **పక్కా ఇళ్ల మేడల మీద సౌర పలకలను అమర్చుకుని, విద్యుత్ తయారు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం భారీగా రాయితీ ఇస్తున్నప్పటికీ జిల్లా వాసుల నుంచి స్పందన అంతగా వుండడంలేదు. 'ప్రధానమంత్రి సూర్యఘర్' పథకం కింద రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. వచ్చే ఏడాది మార్చినాటికి జిల్లాలో ఎనిమిది వేల యూనిట్లను ఏర్పాటు చేయించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 644 మంది మాత్రమే డబ్బులు చెల్లించారు. వీరిలో 440 మంది ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్ యూనిట్లు బిగించారు.**



ఇంటిపై సోలార్ ప్యానెళ్లను అమర్చుతున్న సిబ్బంది

'ప్రధానమంత్రి సూర్యఘర్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించింది. ఈ పథకం కింద ఇళ్లపైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. సౌరవిద్యుత్ ప్యానళ్లు, ఇతర సామాగ్రికి అయ్యే వ్యయంలో దాదాపు సగం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం రాయితీగా ఇస్తున్నది. మిగిలిన సొమ్మును బ్యాంకు నుంచి రుణంగా తీసుకునే వెసులుబాటు కూడా వుంది. రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్లను మూడు కేటగిరీలుగా ప్రభుత్వం విభజించింది. నెలకు 120 యూనిట్లు ఉపయోగించేవారికి ఒక కిలోవాట్ సోలార్ పవర్‌ప్లాంటు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తారు. ఈ యూనిట్‌కు రూ.60 వేలు ఖర్చవుతుంది. అందులో రూ.30 వేలు రాయితీ వస్తుంది. నెలకు 240 యూనిట్లు వినియోగించేవారు రెండు కిలోవాట్ల సోలార్ పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. దీనికి రూ.1.2 లక్షలు ఖర్చవుతుంది. అందులో రూ.60 వేలు రాయితీగా లభిస్తుంది. కాగా నెలకు 360 యూనిట్లు ఉపయోగిస్తే మూడు కిలోవాట్ల పవర్ ప్లాంటు పెట్టుకోవచ్చు. దీనికి రూ.1.8 లక్షలు పెట్టుబడి అవసరం. రాయితీ రూ.78 వేలు వస్తుంది. పది శాతం సొమ్మును లబ్ధిదారుడు భరిస్తే ప్రభుత్వం ఇచ్చేరాయితీ సొమ్ము పోను మిగిలింది బ్యాంకులు రుణంగా ఇస్తాయి. ఉదాహరణకు మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ యూనిట్ ధర రూ.1.95 లక్షలు. లబ్ధిదారుడు తొలుత 10 శాతం... రూ.20,000 బ్యాంకులో జమ చేస్తే మిగిలిన రూ.1.75 లక్షలు బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. యూనిట్ ఏర్పాటు చేసిన రెండు నెలల తర్వాత కేంద్ర ప్రభుత్వం రాయితీ సొమ్ము రూ.78 వేలు లబ్ధిదారుని ఖాతాలో జమ చేస్తుంది. ఈ సొమ్మును బ్యాంకు రుణానికి జమచేస్తే అసలు, వడ్డీ భారం తగ్గుతుంది. సోలార్ రూఫ్ టాప్‌కి 25 సంవత్సరాలు గ్యారంటీ ఇస్తున్నారు. డీలర్లు ఐదేళ్లపాటు ఉచిత సర్వీసు అందిస్తున్నారు.

3 కిలోవాట్లతో నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

ఇంటి శ్లాబ్ మీద 100 చదరపు అడుగుల స్థలం ఉంటే మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ ... మిగతా 8వ పేజీలో

కలెక్టర్ పొలంబాట

మేడిచర్లలో పంటలు పరిశీలించిన విజయకృష్ణన్

- ఈ-క్రాప్ నమోదుపై ఆరా
- పంట పొలంలో రైతు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్
- వివరాలు సరిపోవడంతో సంతృప్తి



యాప్‌లో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కె.కోటపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం సాయంత్రం మండలంలోని మేడిచర్లలో పంట పొలాలను పరిశీలించారు. అప్పటికే చీకటి పడడంతో అధికారులు, రైతుల మొబైల్ ఫోన్ల టార్చ్ లైట్ల వెలుగులో రైతు రొంగలి దేముడుకు చెందిన మినుము పంటను చూశారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నారా? అని రైతును ప్రశ్నించారు. పొలంలో వున్న పంటను ఈ-క్రాప్‌లో నమోదైందో లేదో తెలుసుకునేందుకు రైతు దేముడుతో ఆమె ఫొటో తీసుకొని అప్‌లోడ్ చేశారు. వివరాలు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పిల్లి పెసర, జనుము పంటలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల రాయితీల గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు, కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో సాంబశివరావు, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఏఈఓ లైలాదేవి, వీఏఏ హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

- రూ.3 లక్షల జరిమానా
- పెళ్లి చేసుకుంటానని బాలికను మోసగించిన కేసులో శిక్ష

సబ్బవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో ఆరేళ్ల క్రితం ఒక బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ విశాఖలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పుచెప్పారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ఎస్పీ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

సబ్బవరం మండలం టెక్కలిపాలెం శివారు నాయనమ్మపాలెం గ్రామానికి చెందిన ఎర్ర నవీన్, తనతోపాటు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఒక బాలికతో పరిచయం వుంది. తరువాత నవీన్ ఐటీఐలో చేరగా, బాలిక ఇంటర్‌పూర్తి చేసి డిగ్రీలో చేరింది. నవీన్ తరచూ కళాశాలకు వెళ్లి ఆమెను కలుస్తుండేవాడు. కొద్ది రోజుల తరువాత నిన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లికూడా చేసుకుంటానని చెప్పాడు. అంతేకాక ఆమెకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబరుచుకున్నాడు. కొద్ది రోజుల తరువాత ఆమె గర్భందాల్చింది. ఇచ్చిన మాట ప్రకారం పెళ్లి చేసుకోవాలని కోరగా, నవీన్ తిరస్కరించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం బాలిక గర్భవతి కావడానికి నవీన్ కారణమని నివేదిక వచ్చింది. దీంతో అప్పటి దిశ పోలీస్‌స్టేషన్ అధికారి ప్రేమ్‌కాజల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ... మిగతా 8వ పేజీలో

హెల్మెట్‌ధారణపై బైక్ ర్యాలీ

- ప్రారంభించిన డీఎస్పీ శ్రీనివాసరావు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నక్కపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు మంగళవారం నక్కపల్లిలో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణతో బైక్ ర్యాలీ నిర్వహించారు. నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు జెండా ఊపి 100 బైక్‌లతో ర్యాలీని ప్రారంభించారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ నుంచి అడ్డరోడ్డు వరకూ, అడ్డరోడ్డు నుంచి నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం వరకూ హెల్మెట్‌ధారణతో బైక్ ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో సీఐ కె.కుమారస్వామి, ఎస్ఐలు సన్నిబాబు, విభీషణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు, దార్ల కృష్ణ, గంట్యాడ రమేశ్, జనసేన మండలఅధ్యక్షుడు వెలగా సుధాకర్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించి ఫ్యాక్టరీని నడపాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము



కార్మికులతో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో కర్మాగారంలో ఉద్యోగులు, కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు వెంటనే ఇచ్చి, ఫ్యాక్టరీని యథావిధిగా నడపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం కర్మాగారం వద్ద కార్మికులను కలిసి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కర్మాగారాన్ని మూసేస్తున్నట్టు ప్రకటించడం చట్టప్రకారం నేరమన్నారు. కర్మాగారంలో ఒడిదుడుకులు ఉంటే మూడు నెలల ముందు ఉద్యోగులకు ముందస్తు నోటీసులివ్వాలన్నారు. కర్మాగారం యథావిధిగా నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా హనుమాన్ ప్రథమ వార్షికోత్సవం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలోని అభయ ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. కాలనీలోని మహిళలంతా కలిసి స్వామివారికి పిండివంటలు తయారు నైవేద్యం సమర్పించారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటుచేశారు. కాలనీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి ప్రసాద్, హైరామ్, బ్లాక్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్.రాయవరం మేజర్ పంచాయతీతోపాటు వాకపాడు, వెంకటాపురం, సర్వసిద్ధి, సైతారుపేట గ్రామాల్లో ఉన్న ఆక్వా చెరువుల ప్రదేశాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల తొలగింపు పనులతోపాటు ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

జంపపాలెం పాఠశాలలో ఇంగ్లీష్ భాషా దినోత్సవం



ఇంగ్లీష్ భాషా దినోత్సవాన్ని జరుపుతున్న ఉపాధ్యాయులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఇంగ్లీష్ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శాస్త్రి, ఉపాధ్యాయులు బొడ్డేటి సత్యనారాయణ, కృష్ణారావు విద్యార్థులకు డ్రాయింగ్, రీడింగ్, రైమ్స్, ఇంగ్లీష్ భాష గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, రామ అప్పలనాయుడు, నాగరాజు, సుధాకర్, శివ, చిట్టిరాజు, శ్రీను, షబ్బీర్ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు హెచ్ఎం జాన్‌ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హైవేపై ఒంటె



నక్కపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి హైవేపై మంగళవారం సాయంత్రం ఒంటె సందడి చేసింది. వేంపాడు నుంచి అడ్డరోడ్డు హైవే వైపు వెళ్తున్న ఒంటెను పలువురు తమ మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించారు. హైవే పక్కన వున్న పచ్చని చెట్ల వద్ద మేత మేసింది.

అధ్వానంగా మార్టూరు రోడ్డు

- అడుగడుగునా గోతులు
- అచ్యుతాపురం-రాంబిల్లి మండలాలకు ఇదే ప్రధాన రహదారి
- ప్రభుత్వం మారిన తీరని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



కూనిశెట్టి బలిజ చెరువు మలుపు వద్ద గోతులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-మార్టూరు రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగడుగునా గోతులమయమైంది. దీంతో రెండు మండలాల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

అచ్యుతాపురం-ఎలమంచిలి ప్రధాన రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మార్టూరు వరకు గల నాలుగు కిలోమీటర్ల రోడ్డుని 30 ఏళ్ల క్రితం నిర్మించారు. తర్వాత దీని విషయాన్ని అధికారులు, పాలకులు మరిచిపోయారు. దీంతో ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయి, కనీసం నడవడానికి కూడా అనువుగా లేకుండా పోయింది. అయితే 2015లో సెజ్ ఏర్పాటుతో నిర్వాసిత రైతులకు మార్టూరు పక్కనే 500ల ఎకరాల్లో 4500 ప్లాట్లు వేసి పునరావాసం కల్పించారు. వీరంతా సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో గృహాలు నిర్మించుకొని నివాసముంటున్నారు. ఈ పునరావాస కాలనీకి చెందిన వారంతా అచ్యుతాపురం రావాలంటే మార్టూరు రోడ్డే గతి. దీంతో ఈ రోడ్డు అవసరాన్ని గమనించిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2017లో రూ.1.25 కోట్లతో ఐదు మీటర్ల మేరకు వెడల్పు చేసి తారు రోడ్డుగా మార్చారు. ఈ రోడ్డు బాగు పడడంతో సెజ్ పునరావాస కాలనీలోని వారితోపాటు కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆనందపడ్డారు. అయితే రోడ్డు బాగుండడంతో సెజ్ కంపెనీలకు వెళ్లే బస్సులు, యంత్రసామగ్రిని తీసుకువెళ్లే వాహనాలు ఈరోడ్డు గుండానే వెళ్లడం ప్రారంభించాయి. అలాగే గతంలో అచ్యుతాపురం నుంచి రాంబిల్లి మండలానికి చెందిన వివిధ గ్రామాల వారు వెదురువాడ, వెంకటాపురం జంక్షన్ మీదుగా వెళ్లేవారు. అయితే మార్టూరు రోడ్డు బాగుపడడంతో రాంబిల్లి మండలంలోని నాయుడుపాలెం, వెల్చూరు. కొండవారపాలెం, రాంబిల్లి, వైలోవ, వాడనరసాపురం, కొత్తపట్నం, రాజకోడూరు, క్రిష్ణంపాలెం తదితర గ్రామాల వారంతా ఈరోడ్డు గుండానే రాకపోకలు ప్రారంభించారు. ఇలా వెళ్లడం వల్ల పైగ్రామాల వారికి ఐదు కిలోమీటర్లు తగ్గుతుంది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా రోడ్డు నిర్మించిన రెండేళ్ల తర్వాత గోతులమయమైంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు గురించి అసలు పట్టించుకోలేదు. అయితే మార్టూరుకి పక్కనే యేకోహమా టైర్ల కర్మాగారం 2022 ఆగస్టులో ప్రారంభించారు. దీని ప్రారంభోత్సవానికి మంత్రులు, పార్టీనాయకులు, వివిధ శాఖల అధికారులు వస్తుండడంతో కంపెనీ యాజమాన్యం రోడ్డుపై పడిన గోతులను తాత్కాలికంగా పూడ్చివేసింది. అయితే వేసిన రెండు నెలలకే ఈ రోడ్డు యధార్థ స్థితికి వచ్చేసింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏ మాత్రం వర్షం పడినా ఈ రోడ్డులో గోతులు బావులను తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చినా దీని పరిస్థితి మారలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు ఈరోడ్డు గురించి పట్టించుకోవాలని కోరుతున్నారు.



వెదురువాడ ఎస్సీ కాలనీ వద్ద గోతులు

ఎలమంచిలిలో ఆధ్యాత్మిక శోభ

- విగ్రహాలకు తిరువీధి ఉత్సవం
- భారీగా పాల్గొన్న భక్తులు
- ఆకట్టుకున్న మహిళల కోలాటం



పురవీధుల్లో విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఎలమంచిలి. ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):శివ నామస్మరణతో సోమవారం సాయంత్రం ఎలమంచిలి పుర వీధులన్నీ మార్మోగాయి. కొత్తపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయ పునః ప్రారంభం సందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలకు తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి వందల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శివ నామస్మరణ చేసుకుంటూ విగ్రహాలను ఊరేగించారు. ఆలయం నుంచి రైల్వే స్టేషను రోడ్డు నుంచి గాంధీనగర్ ప్రధాన రోడ్డు మీదుగా ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో దారిపొడవునా మహిళల కోలాటం ఆద్యంతం ఆకట్టుకుంది. ఆలయ అర్చకుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ రమాకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, చార్టెర్డ్ అక్కౌంటెంట్ బీఎస్. బంగారు శెట్టి, పెద్దింటి సూర్యనారాయణమూర్తి, ఏఎంసీ మాజీ డైరెక్టరు సుందరపు బాబ్జీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లంక రాజు, పిల్లా త్రినాథ్, న్యాయవాది కూనిశెట్టి శ్రీనివాసరావు, బీజేపీ నేత పప్పు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో చిన్నారులు, మహిళల కోలాటం

ఘనంగా ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు



లక్ష్మీపతిరాజుపేటలో పారిశుధ్య కార్మికుడికి దుస్తులు పంపిణీ చేస్తున్న పాకలపాటి రవిరాజు



కొక్కిరాపల్లి ప్రేమసమాజానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న గొంతిన శ్రీనివాసరావు తదితరులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ, రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపతిరాజుపేట గ్రామంలో సాయంత్రం పలువురు బీజేపీ నాయకులు, స్కూల పిల్లల సమక్షంలో రవిరాజు కేక్ కట్ చేసి అందరికి పంచారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు, పేదలకు భోజనం ప్యాకెట్లు, విద్యార్థులకు స్వీట్స్ రవిరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బి. జోగినాయుడు, డాక్టర్ అనిల్ వర్మ, నాయకులు వంశీ గణపతి, సేనాపతి సూర్యారావు, జి. వెంకటరమణ, నూకయ్య శెట్టి, వీర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమసమాజానికి నిత్యావసర సరుకుల వితరణ

ఎలమంచిలి: అనకాపల్లి ఎంపీ సీఎం. రమేశ్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం కొక్కిరాపల్లి ప్రేమసమాజానికి నెల రోజుల సరిపడా నిత్యావసర సరుకులను తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు అందజేశారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు వీటిని అందజేసినట్టు గొంతిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా కశింకోట మండలం త్రిపురవారిపాలెం గ్రామానికి చెందిన వికలాంగుడు పిల్లిబోయిన రాముకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, మాజీ ఎంపీపీ వేగి గోపీ కృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టరు సిదిరెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు గొంతిన చిరంజీవి, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం.రమేశ్ జన్మదిన వేడుకలు మంగళవారం బీజేపీ పట్టణ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీరంగ రమేష్ తదితరులు స్థానిక పీహెచ్‌సీలో కేక్‌ని కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంచాల గాంధీ, పట్టణ అధ్యక్షుడు కువల కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోనే రంగయ్యస్వామి, ముప్పిన విష్ణు, గింజాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలో నాగులాపల్లి టీడీపీ క్యాంపు కార్యాలయంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం కేక్ కట్ చేసి అందరికి పంచారు. ఈ వేడుకలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం, కూటమి నాయకులు శరగడం యోగినాగేశ్వరరావు, ఆడారి జనార్దన్, బొడ్డేడ అప్పలనాయుడు, పొలమరశెట్టి మురళి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు



ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

పాయకరావుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన జ్ఞానజ్యోతి కార్యక్రమంపై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు విద్యాశాఖాధికారులు మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణలో ఎంఈఓ కేఎస్.గాంధీ మాట్లాడుతూ ప్రీ స్కూల్స్ మరింత బలోపేతం చేయడం కోసం బాల్యంలో అందవలసిన సౌకర్యాలు, విద్య తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వివిధ దశల్లో ఇవ్వనున్న శిక్షణ తరగతులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం డీఆర్పీలు హరికృష్ణ, శ్రీను, సతీష్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, నిషా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణతరగతులను ప్రారంభించారు. ఎంఈవో కె.నరేశ్ జ్ఞానజ్యోతి శిక్షణ గురించి వివరించారు. పిల్లలకు బోధనలో మెలకువలు, పిల్లల ఆలోచనా విధానం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు ప్రసాద్, గణేశ్, లలిత, సత్యవతి పాల్గొన్నారు.

మునగపాకలో..

స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మొదలయ్యాయి. మునగపాక, తోటాడ కస్టర్లకు చెందిన 50 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారని సీడీపీవో ఇంద్రాదేవి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీలు బుద్ధ నర్సింగరావు, జీవీఎస్ జగదీశ్, కె.శ్రీనివాసరావు, అన్నపూర్ణ, మీరాబీలు శిక్షణ కల్పించారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో అంగనవాడీ టీచర్ల జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను డిప్యూటీ డీఈవో పి. అప్పారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నుంచి ఎనిమిదేళ్ల పిల్లలను ప్రాథమిక విద్యకు అలవాటు పడే విధంగా అంగనవాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. శిక్షణ అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తమ విధులను సక్రమంగా వ్యవహరించాలని అప్పారావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వప్నప్రియ రెడ్డి, హెచ్ఎం బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ తరగతులను ఏఎంవో పట్నాయక్ ప్రారంభించారు. ఎంఈవోలు రామారావు జోషిలు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ పిల్లలకు పౌష్టిహారాన్ని ఎలా అందించాలి? బోధన విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఉపాధ్యాయురాలు కేజీయా, రిసోర్స్‌పర్సన్స్ విలియమ్స్ అప్పారావు, విజయ్‌చందర్ పాల్గొన్నారు.

ఘనంగా మడుతూరు, నడింపల్లిల్లో జాతరలు



మడుతూరులో నూకాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడుతూరులో నూకాలమ్మ, నడింపల్లిల్లో పైడితల్లమ్మ జాతరలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామస్థులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ రెండు ఆలయాలను సందర్శించి, పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మోటూరు శ్రీవేణి, వెన్నెల అప్పలనాయుడు, చుక్క అనూరాధ, త్రినాథస్వామి, టెక్కలి పరశురామ్, యాంద్ర షణ్ముఖ్, మేడిశెట్టి వెంకటరావు, యాంద్ర కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యపేటలో ఆధార్ శిబిరం



ఆధార్ క్యాంపును తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట సచివాలయంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 0 నుంచి 6 సంవత్సరాల వయస్సున్న పాఠశాలల పిల్లలకు ఆధార్ సవరణ, నమోదు వంటి ప్రక్రియను చేపట్టారు. ఎంపీడీవో సీతారామరాజు ఆధార్ శిబిరాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో ఆధార్ కార్డులు లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయాలని సూచించారు. బుధవారం కూడా ఈ శిబిరం వుంటుందన్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

రేబాకలో వీహెచ్‌పీ సమావేశం



రేబాకలో సమావేశమైన వీహెచ్‌పీ ప్రతినిధులు

నక్కపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ సన్నిధి వద్ద మంగళవారం విశ్వహిందూ పరిషత్ పాయకరావుపేట ప్రఖండ కమిటీ సమావేశం జరిగింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బొంకుమల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీహరిరాజు పాల్గొన్నారు.ఈ సమావేశంలో భవిష్యత్‌లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మండల, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రతినిధులు రామాల శివ నాగేశ్వరరావు, కట్టా వీరబాబు, ప్రవల్లిక, కృష్ణ కుమారి, సాంబమూర్తి పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎస్.రాయవరం జడ్పీ హైస్కూల్‌లో కరపత్రాలు చూపుతున్న దృశ్యం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆయా అభ్యర్థుల మద్దతుదారులు మండలంలోని పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహి స్తున్నారు. ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఓటరుకి వందనం అనే కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఓటర్లను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, హెచ్ఎం అసోసియేషన్ సంఘ నాయకులు సత్యనారాయణ, డి.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయ, ఉపాధ్యాయ సంఘ నాయకులు రాజు, ప్రేమ్‌కుమార్, భాషా, కాశి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో ఆధార్ కేంద్రాన్ని పునరుద్ధరించండి

- అధికారులకు పలువురి వినతి

నక్కపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం పరిధి మీ-సేవా కేంద్రంలో శాశ్వత ఆధార్ నమోదు సదుపాయం లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీటీసీ సభ్యురాలు వీసం దేవి పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మంగళవారం జేసీకి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. నక్కపల్లి సచివాలయం పరిధి మీ-సేవా కేంద్రంలో 14 ఏళ్లపాటు కొనసాగిన ఆధార్ నమోదు కేంద్రాన్ని నిలిపివేయడంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. నక్కపల్లిలో ఆ సదుపాయం లేనందున ఎలమంచిలి, ఎస్.రాయవరం వెళ్లాల్సివస్తోందన్నారు. నక్కపల్లిలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు



కోటవురట్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కోటవురట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ తిరుమలబాబు, నర్సీపట్నం ఆర్‌డీవో కార్యాలయంలో డీటీ సుధారాణి పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ తిరుమలబాబు హైస్కూల్ ప్రాంగణం అంతా శుభ్రంగా ఉండాలని హెచ్ఎం లక్ష్మికి సూచించారు. వారి వెంట రెవెన్యూ ఉన్నారు.

జల దృక్పథం నమూనాకు రాష్ట్ర స్థాయి అవార్డు

» చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఘనత



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థుల బృందం

నర్సీపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన జలదృక్పథం నమూనాకు రాష్ట్ర స్థాయిలో అవార్డు వచ్చింది. చెన్నైలోని సీపీఆర్ పర్యావరణ కేంద్రం, విప్రో సంస్థ సంయుక్తంగా సుస్థిరిత-నీరు, సుస్థిరిత వ్యర్థాల నిర్వహణ, సుస్థిరిత జీవ వైవిధ్యం తదితర అంశాలపై నమూనాలు తయారు చేయాలని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 304 పాఠశాలల నుంచి నమూనాలు ప్రదర్శించారు. వీటిలో జాతీయ స్థాయి ప్రదర్శనకు 18 నమూనాలు అర్హత సాధించాయి. అందులో సుస్థిరిత నీరు విభాగానికి చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని వెలంకాయల సాయి శివాని నేతృత్వంలో వండూరు మనోజ్‌కుమార్, మోక్ష, మాధురి, కౌసిక్ బృందం తయారు చేసిన మురికి నీరుని పరిశుద్ధి చేసే జలదృక్పథం నమూనా రాష్ట్ర స్థాయిలో అవార్డు కైవసం చేసుకుంది. మంగళవారం అమరావతిలో పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కమిషనర్ విజయరామరాజు, పాఠశాల విద్యా అకడమిక్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మీ చేతుల మీదుగా రూ.10 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని ఉపాధ్యాయుడు రాజగోపాల్, విద్యార్థులు అందుకున్నారు.

మెయిన్ రోడ్డులో తొలగిన మురుగునీటి సమస్య

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పూడికల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఎండీవో, ఈవోఆర్డీ

చోడవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డుపై మురుగునీటిని మంగళవారం ఎండీవీ పీ ఎస్‌జే ఆంజనేయులు, ఈవో ఆర్డీ మహేశ్ దగ్గరుండి తొలగింప చేశారు. ' మెయిన్ రోడ్డుపై మురుగునీటితో అవస్థలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 16 ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సాయిరాం గ్రాండ్ హోటల్ సమీపంలోని రోడ్డు పక్కనున్న కాలువలో పూడిక తీయించారు. అధికారులకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

చీడికాడ: మండలంలో వీరభద్రునిపేట శివారు కొన్నెంపూడి, గొప్పూరు గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. 'గ్రామాల్లో అంధకారం' శీర్షికన మం గళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీంతో అధికారులు స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించడంతో గిరిజనులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

నెలాఖరులోగా పశుగణన సర్వే పూర్తి



రికార్డులు పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ చిట్టినాయుడు

చీడికాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వే ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా.వి. చిట్టినాయుడు ఆదేశిం చారు. మండలంలోరి అర్జునగిరి, తురువోలు రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పశుగణన సర్వే ఏ మేరకు పూర్తిచేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సర్వేచేసిన ఇళ్లను సందర్శించి డేటా సరిగ్గా తీసుకున్నది లేనిది పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, మండలంలో 50శాతం ఆవులు, గేదెలు, 70శాతం గొర్రెలు, మేకలు సర్వేగణన పూర్తయినట్టు ఆయన తెలిపారు. మిగతా సర్వే ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సిబ్బంది గంగునాయుడు, రాజేశ్ పాల్గొన్నారు.


పంట కాలువలకు ప్రాధాన్యం



ఉపాధి పథకం కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలు సక్రమంగా పూడికలు తీస్తే ఆయకట్టు భూములకు సక్రమంగా నీరతుందని స్థానిక ఎంపీడీఓ సువర్ణరాజు అన్నారు. మండలంలోని వాకపల్లి, తిమిరాం, కలిగొట్ల, బీకింతాడ, గ్రామాల్లో ఉపాధి పనులు, సంపద కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల కో ఆర్డినేటర్ విపివి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమారెమ్మ గరగలు ఊరేగింపు



అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న భక్తులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండల అగ్రహారం గ్రామంలో నల్లమారమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సహ కమిటీ ప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నల్లమారెమ్మ గరగలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు గరగలను గ్రామంలో ఊరేగిస్తామని చెప్పారు. అనంతరం 20వతేదీన నల్లమారెమ్మ పండుగ నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త గూడూరి వెంకటరాజు చెప్పారు. పండుగ రోజు భారీ అన్నసమారాధన కార్యక్రమంతో పాటు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిటికల వెంకటరమణ, స్థానిక నాయకులు పొలిరెడ్డి రమణ, ఈశ్వరరావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా పనిచేయాలి

నాతవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో వచ్చే మార్పులకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పనిచేయాలని ఏఎంవో మురళిమోహన్ పట్నాయక్ సూచించారు. మండల కేంద్రంలోఆరు రోజుల పాటు జరిగే జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులకు హాజరైన పట్నాయక్ మాట్లాడుతూ ప్రాథమికంగా రాయడం, అంకెలు చదవడం, ప్రాథమిక విద్య తదితర అంశాలపై నైపుణ్యం పెంపొందించేందుకు ఇచ్చే ఈ శిక్షణను అంగన్‌వాడీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-1, 2 సత్యనారాయణ కె.వరహాలబాబు, సీఆర్‌పీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఆటలతో సందడిగా కనిపిస్తున్న మైదానం (ఫైల్ ఫొటో)



ప్రస్తుతం పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోయిన వైనం..!

నాడు కళకళ.. నేడు వెలవెల

» మాడుగులలో పోలీసు డ్రిల్ మైదానం దుస్థితి

» క్రీడా మైదానంగా మార్చాలని గ్రామస్థుల అభ్యర్థన

మాడుగుల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో ఉన్న పోలీసు డ్రిల్ మైదానం కళావిహీనంగా మారింది. ఎస్ఐ వై. తారకేశ్వరరావు ఇక్కడ పనిచేసిన సమయంలో ఈ మైదానంపై శ్రద్ధ వహించారు. ఆయన ఇటీవల బదిలీపై వెళ్లి పోవడంతో మళ్లీ యథాస్థితికి చేరింది. నాలుగేళ్ల క్రితం ఇక్కడికి వచ్చిన తారకేశ్వరరావు ఈ మైదానం అభివృద్ధికి కృషి చేశారు. ఈ డ్రిల్ మైదానాన్ని క్రీడా మైదానంగా మార్చి పిల్లలకు క్రీడల్లో శిక్షణ అందించారు. జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలు ఇక్కడ నిర్వహించారు. ఈ మైదానంలో స్థానిక పోలీసులకు వ్యాయాయ సాధన, క్రీడలకు వీలుగా అప్పట్లో కొంత మేర స్థలాన్ని ఉపయోగించుకునేవారు. ఎస్ఐ తారకేశ్వరరావు ఇక్కడినుంచి బదిలీపై వెళ్లిపోవడతో మైదానంలో మళ్లీ పిచ్చి మొక్కలు, తుపలు పెరిగిపోయి రూపురేఖలు మారిపోయాయి. గతంలో మోదకొండమ్మ అమ్మవారి పండుగకు, తీర్థాలకు ఈ మైదానంలో రంగుల రాట్నాలు, జాయింట్ వీల్, సర్కస్‌లు ఏర్పాటు చేసేవారు. అప్పటి అధికారులు వద్దని చెప్పడంతో వీటిని ఏర్పాటుచేయడం మానేశారు. పండగలకు వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించేవారు. ప్రస్తుతం అదీ కూడా లేకుండా పోయింది. దీంతో వృథాగా మారడంతో ఆ స్థలంలో బహిరంగ మలవిసర్జనకు నిలయంగామారింది. దీంతో రోడ్డుపై నడిచి వెళ్లేవారు దుర్గంధంలో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గ్రామంలో అత్యధికశాతం మంది యువత కు క్రీడలపై ఆసక్తి ఉన్నా మైదానం లేక మైదానంలేక మిన్నకుండిపోతున్నారు. గతంలో మాదిరిగా ఈ పోలీస్ డ్రిల్ మైదానాన్ని కీడ్రా మైదానంగా మార్చి యువతకు చేయూతనందించాలని గ్రామ పెద్దలు, యువత కోరుతున్నారు. దీనిపై పోలీసు అధికారులు దృష్టిసారించానని విజ్ఞప్తి చేస్తున్నారు.

గొల్లలపాలెంలో నేత్ర వైద్య శిబిరం

కె.కోటపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపాలెంలో మంగళవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేశారు. 24 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరందరినీ ఆపరేషన్ల కోసం విశాఖపట్నం ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తరలిస్తామని క్యాంపు కో-ఆర్డినేటర్ ఆర్.స్వాములు తెలిపారు. సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు సాయికుమార్, వైష్ణవి, పి.గీత సాయి, సంతోషి, గాంధీ, సంఘ సభ్యులు కె.అప్పల నాయుడు, పల్లా శ్రీను, మంగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి ఘన సన్మానం

రోలుగుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో ఈ నెల 11 నుంచి 15 వరకు నిర్వహించిన సెంట్రల్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ ట్రైనింగ్‌లో జె.నాయుడుపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుని కేవీఎల్ ప్రవీణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఆమెను సత్కరించారు. ఈ వర్క్‌షాపునకు రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపిక కాగా, వీరిలో ప్రవీణ ఉండడం గర్వించదగ్గ విషయమని హెచ్‌ఎం రమేశ్‌కుమార్ తెలిపారు.

గంధవరం ఉపాధి పనుల్లో అక్రమాలు

» విచారణకు టీడీపీ నేతల డిమాండ్



మాట్లాడుతున్న టీడీపీ నేతలు, స్థానిక యువకులు

చోడవరం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంధవ రం పంచాయతీలో జరిగిన ఉపాధి పనుల్లో సుమారుగా రూ.10 లక్షల మేర నిధులు స్వాహ చేశారని, పనులకు రాకున్నా వచ్చినట్టుగా రికార్డుల్లో చూపి స్థానిక ఉద్యోగి దోచుకున్నట్టు టీడీపీ నేతలు, స్థానిక యువకులు దేవరపల్లి రవికుమార్, కొర్ని కొండలరావు, నంబారు నాయుడు, నంబారు నరసింగరావు, దేవర శ్రీనివాసరావు, గణేశ్, రామోజీ, నాయుడు ఆరోపించారు. మంగళవారం వారు విలేకరులతో మా ట్లాడారు. ఈ పంచాయతీ పరిధిలో ఉపాధి పనుల్లో గత రెండేళ్లలో జరిగిన ఉపాధి పనుల్లో భారీగా నిధులు దుర్వినియోగమైనట్టుచెప్పారు. గ్రామానికి చెందిన కేన్సర్‌రోగి ఉపాధి పనికి వచ్చినట్టు చూపించి రూ. 80వేలు, మరో ఇద్దరు వృద్ధుల పేర్లు మీద 2020నుంచి 2024 వరకూ పూర్తి మస్తరు చూపించి రూ. 1. 23 లక్షల కూలి రూపంలో దోచేశారని తెలిపారు. ఇలా 23 మంది పేరిట రూ. 10లక్షల నిధులు ఆ ఉద్యోగి కాజేశారని ఆరోపించారు. వీటిపై సమగ్రంగా విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఉపాధి ఏపీవో దేవి మాట్లాడుతూ, గంధవరంలో ఉపాధి పనులలో అవతవకలకు సంబంధించి గతంలోనే ఫిర్యాదు ఇచ్చారన్నారు. అందులో వివరాలు సరిగాలేవన్నారు. తమకు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

ఘనంగా ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు





ఎంపీ రమేశ్‌కు శుభాకాంక్షలు తెలుపున్న ఎమ్మెల్యే రాజు, కె.కోటపాడులో రొట్టెలు, పండ్లు పంపిణీచేస్తున్న బీజేపీ నేతలు

చోడవరం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసిన అభిమానులు, కార్యకర్తలకు పంచారు. కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పేదలకు వస్త్రాలు అందించారు. ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, దేవరపల్లి వెంకట అప్పారావు, జనసేన నాయకులు సిరిపురపురమేశ్, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు, సాలాపు నరసింహమూర్తి, ఎర్రంశెట్టి చిన్న, ఈర్లె శ్రీనివాస్, ఆర్‌టీవో చిన్న, చీపురుపల్లి సూర్యనారాయణ, గూనూరు సురేశ్ తదితరులు పాల్గొన్నారు. సీఎం రమేశ్ వద్దకు స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

కె. కోటపాడులో...

కె.కోటపాడు: అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేశ్ పుట్టిన రోజు పురస్కరించుకుని మంగళవారం స్థానిక 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో బీజేపీ నేతలు రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ ఆధ్వర్యంలో నాయకులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో డాక్టర్ రెడ్డి రమా, నాయకులు కొట్టాన ఈశ్వరరావు, దొగ్గ ఈశ్వరప్రసాద్ (సూర్యవంశీ), జనపరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఆలయ వార్షికోత్సవం

రావికమతం, ఫిబ్రవరి18, (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయక స్వామి ఆలయ 26వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలను అర్చకుడు రాచకొండ లక్ష్మీనారాయణ నిర్వహించారు. భక్తులు భజన కార్య క్రమం ఆకట్టుకుంది. ఎంపీపీ పైల రాజు, వైసీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మీనాయుడు, కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మాజీ మండల ఉపాధ్యక్షుడు గంటా ఈశ్వరావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

నాతవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉషశ్రీ కోరారు. 19న చెర్లోపాలెం ,20న వల్లంపేట, 21న ఎంబీపట్నం, 24న చమ్మచింత, 25న గన్నవరం, 27న నాతవరం, 28న సరుగుడులలో ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు.

నేడు సంపద కేంద్రం నిర్వహణపై శిక్షణ

గొలుగొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట చెత్త నుంచి సంపద కేంద్రంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు. సంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

బాలికలకు రక్షణగా పోక్సో చట్టం



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టం లైగింక వేధింపుల నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ రక్షణగా నిలస్తుందని సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ తెలిపారు. మంగళవారం జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఈ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లల పట్ల వికృత చేష్టలకు తెగబడే వారి నుంచి రక్షణ కోసం పోక్సో చట్టం రూపొందించారని చెప్పారు. ఈ చట్టం మీద అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలదారులపై చర్యలు తీసుకోవాలి

మాకవరపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో భీమబోయినపాలెంలో గ్రామ కంఠం భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళశారం తహసీల్దార్ రామరావుకు ఫిర్యాదు చేశారు. భీమబోయినపాలెంలో 88వ సర్వే నంబరులోని గ్రామ కంఠం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రంగా నిర్మాణాలు చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఎద్దు లోవరాజుతో పాటు మరికొంత మంది తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో విన్నవించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



బుచ్చెంపేటలో మాట్లాడుతున్న ఎంఈవో జగ్గారావు

రావికమతం, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీహైస్కూల్‌లో అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవో ఎన్. బ్రహ్మాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు ప్రైవేట్ పాఠశాల్లో అందిస్తున్న విద్యకు దీటుగా ఇకపై అంగన్‌వాడీల్లో అందించాలని కోరారు. పూర్వ ప్రాథమిక విద్యలో గుణాత్మకమైన విద్యను అందించే ఈ జ్ఞాన జ్యోతి శిక్షణ ఆరు రోజుల పాటు అందిస్తామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరోజినీ,రాజేశ్వరి మాట్లాడుతూ, అంగన్‌వాడీల్లో చిన్నారులను పాఠశాలలకు వెళ్లడానికి వీలుగా పునాది అభ్యసన నాణ్యతను బలోపేతం చేయాలన్నారు. అంగన్‌వాడీల్లో బోధనా నైపుణ్యాల పెంచడానికి ఈ శిక్షణ దోహద పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు విద్యావతి,ఎ.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జడ్పీ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జగ్గారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్థాయి బోధన సామర్థ్యాలు మెరుగుపరుచుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. హెచ్‌ఎం శేఖర్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 సత్యనారాయణ, ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, హెచ్‌ఎం ఎస్వీ పద్మావతి, ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు, సూపర్‌వైజర్లు ఎల్వీ సుశీల రాములమ్మ, స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు అశోక్‌కుమార్, పి.ఉమామహేశ్వరరావు, బి.త్రినాథరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారులు పీ.ఎస్.ఎన్‌మూర్తి, జాన్‌ప్రసాద్ చెప్పారు. సోమవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో వారు మాట్లాడుతూ పిల్లల భాషాభివృద్ధికి, గణిత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే గణితంలో బేసిక్ భావనలు, ఇతర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బోధన చేయడంపై రిసోర్స్ పర్సన్లు రాము, వరలహాలబాబు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

డ్వాక్రా సంఘాల బలోపేతానికి చర్యలు

-మంగ, ఏపీఎం, వెలుగు



మండలంలో 1522 డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. పొదుపు ప్రాధాన్యత, బ్యాంకు రుణాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సభ్యులు ప్రైవేటుగా చిరు వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం. మహిళలు ఆర్థికంగా మరింత బలపడేలా స్త్రీనిధి రుణాలు ఉపయోగకరమని చెబుతున్నాం. జీడి, మామిడి తోటల అభివృద్ధిపై పలు సూచనలు చేస్తున్నాం.

ప్రశ్న: డ్వాక్రా సంఘాల బలోపేతానికి ఏ చర్యలు చేపడుతున్నారు?

జవాబు: మండలంలో 1522 డ్వాక్రా సంఘాల్లో 16,320 మంది సభ్యులు ఉన్నారు. సంఘాల బలోపేతానికి ప్రతీ వారం సమావేశాలు నిర్వహిస్తున్నాం. పొదుపు ప్రాధాన్యత, బ్యాంకు రుణాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు పలు కొత్త విషయాలను తెలియజేస్తున్నాం.

ప్ర: డ్వాక్రా సభ్యులకు ఈ ఏడాది ఏ రుణాలు మేరకు మంజూరు చేశారు?

జ: ఈ ఏడాది బ్యాంకు లింకేజీ కింద రూ.62 కోట్లు రుణాలు మంజూరు చేశాం. సకాలంలో వడ్డీ చెల్లించేలా సభ్యులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ప్ర: స్త్రీ నిధి ద్వారా సంఘ సభ్యులకు ఎంత రుణాలు మంజూరు చేశారు?

జ: ఈ ఏడాది స్త్రీ నిధి ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు రూ.7 కోట్లు రుణాలు మంజూరు చేశాం. సభ్యులు ప్రైవేటుగా చిరు వ్యాపారం చేసుకునేలా సమావేశాలు నిర్వహించాం. మహిళలు ఆర్థికంగా మరింత బలపడేలా స్త్రీనిధి రుణాలు ఎంతో ఉపయోగకరమని చెబుతున్నాం.

ప్ర: పండ్ల తోటల అభివృద్ధికి గ్రూపులు ఏర్పాటు చేశారా?

జ: మండలంలో జీడి, మామిడి తోటల అభివృద్ధికి 117 గ్రూపులు ఏర్పాటు చేశాం. వీరికి తోటల అభివృద్ధిపై పలు సూచనలు చేస్తున్నాం. ఇప్పటికే ఈ గ్రూపులకు సమావేశాలు కూడా నిర్వహించాం.

-మాకవరపాలెం, ఆంధ్రజ్యోతి

పది ఎకరాల్లో యూకలిప్టస్, జీడిమామిడి తోటలు దగ్ధం

చీడికాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కొత్తపల్లి గ్రామ సమీపాన జీడిమామిడి, యూకలిప్టస్ తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడు, కొల్లి వరలక్ష్మికు చెందిన సుమారు ఎనిమిది ఎకరాల జీడిమామిడి, మిగతా రైతులకు చెందిన రెండు ఎకరాల యూకలిప్టస్ తోటలు మంగళవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. సమాచారం మేర కు చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ సందర్భంగా రూ.1.2 లక్షల నష్టం వాటిల్లినట్టు అంచనా. పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు విడుదల

చీడికాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయంనుంచి ఆరుతడి పంట లకు 40 క్యూ సెక్కుల సాగునీటిని మూడు రోజులుగా విడుదల చేస్తున్నట్టు నీటి పారుదల శాఖ ఏఈఈ సీహెచ్. జయరాంపడాల్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జలాశయం గరిష్ఠ స్థాయి నీటి మట్టం 101.25 మీటర్లుకాగా, ప్రస్తుతం 97.60మీటర్ల నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజునాటికి 98.80మీటర్లు ఉంది. ఇన్‌ఫ్లో పది క్యూసెక్కులు కాగా, దిగువ కాలువకు 30 క్యూసెక్కులు, ఎగువ కాలువకు పది క్యూసెక్కుల సాగునీరు సరఫరా చేస్తున్నారు.

ఘనంగా తలుపులమ్మ జాతర

గొలుగొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లి గ్రామంలో తలుపులమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు కె.కొండలరావు, పి.మల్లేశ్వరరావు, అప్పలనాయుడు ఏర్పాట్లు చేశారు.

గంజాయి స్వాధీనం... ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

జి.మాడుగుల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రవాణాకు సిద్ధంగా ఉన్న 22 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.కోడాపల్లి పంచాయతీ గన్నెరుపుట్టులో ఓఇంట్లో గంజాయి ఉన్నట్టు సమాచారం అందడంతో మంగళవారం వెళ్లి పోలీసులు సోదా చేయగా మగు ఇంట్లో తరలించడానికి సిద్ధంగా ఉంచిన 22 కిలోల గంజాయి లభ్యమైంది. మగుతోపాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మరోవ్యక్తి జగదీశ్వరావుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

దట్టంగా పొగమంచు

- తగ్గని చలి తీవ్రత
- జి.మాడుగులలో 12.5 డిగ్రీలు నమోదు



పాడేరు మెయిన్‌రోడ్డులో దట్టంగా పొగమంచు

పాడేరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత కొనసాగుతూనే వుంది. అయితే మధ్యాహ్నం ఎండ ప్రభావం వుండడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. మంగళవారం జి.మాడుగులలో 12.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. డుంబ్రిగుడలో 13.3 డిగ్రీలు, పాడేరులో 13.6, పెదబయలు, హుకుంపేటలో 14.1, ముంచంగిపుట్టులో 14.9, జీకే వీధిలో 15, చింతపల్లిలో 15.4, అరకులోయలో 15.9, అనంతగిరిలో 18.5, కొయ్యూరులో 19.5 డిగ్రీలు నమోదయ్యాయి. కాగా మన్యంతో మంచు ప్రభావం కొనసాగుతూనే వుంది. ఉదయం తొమ్మిది గంటల వరకు పొగ మంచు దట్టంగా కమ్ముకుంటున్నది.

వినియోగంలోకి సంపద కేంద్రాలు



చింతపల్లి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిశీలకుడు నాగరాజు

చింతపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పెసా శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలనకు వచ్చిన కె. నాగరాజుతో కలిసి మండల కేంద్రంలోనున్న సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని తాజంగి సంపద కేంద్రాన్ని ఐటీడీఏ ఇతర అవసరాలకు ఉపయోగిస్తుందన్నారు. బలపం, కుడుముసారి కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 14 సంపద కేంద్రాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రధానంగా చింతపల్లి కేంద్రాన్ని ఈనెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సంపద కేంద్రంలో వర్మికంపోస్టు, కంపోస్టు ఎరువులను ఉత్పత్తి చేస్తామన్నారు. ఘన వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం తరలిస్తామన్నారు. పంచాయతీలకి ఆదాయం వస్తుందని, గ్రామ వీధులు శుభ్రంగా ఉంటాయన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను గృహాల్లో భద్రపర్చి వీధుల్లోకి వచ్చిన పంచాయతీ కార్మికులకు అప్పగించాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్, గుమస్తా అంబేడ్కర్ పాల్గొన్నారు.



హుకుంపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్



రోడ్డు పక్కనున్న బైక్‌ను ఢీకొన్న కారు (ఫైల్‌ఫొటో)

ఇరుకు రోడ్డుతో భయం.. భయం

- హుకుంపేట మెయిన్‌రోడ్డులో దుస్థితి
- విస్తరణకు నోచుకోక సమస్య
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

హుకుంపేట ఫిబ్రవరి 18 ఆంధ్రజ్యోతి: మండల కేంద్రమైన హుకుంపేటలో ఇరుకు రోడ్డుతో రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అరుకు- పాడేరు ప్రధాన మార్గం కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లా అధికారులు సైతం ఈ రోడ్డు మీదుగానే డుంబ్రిగుడ, అరకు, అనంతగిరి మండలాలకు వెళ్తుంటారు. ఇక్కడి మెయిన్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి వాహనాలు నిలిచిపోతున్నాయి. దీని వల్ల ఆరోగ్య సమస్యలతో అత్యవసర సమయాల్లో 108 వాహనం, ఇతర అంబులెన్స్ వెళ్లేందుకు సమస్యలు తలెత్తుతున్నట్టు వాహన డ్రైవర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సాధారణ రోజుల్లో ఇంతగా సమస్య ఎదురవుతుంటే జరుగుతుందంటే ప్రతి వారం శనివారం జరిగే సంత రోజు మరింత వాహనాల రద్దీనెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కరోనా సమయంలో వర్తక సంఘ వ్యాపారులు ఇరుకు రోడ్డులోనే ఇరువైపులా పలు దుకాణాలు ఏర్పాటు చేయటంతో మరింత ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇక్కడ రోడ్డు ప్రమాదలు జరుగుతున్నాయి. గత నెలలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు వచ్చి ఓ వ్యక్తి పక్కన బైక్ నిలిపి ఉంటే.. ఇరుకు రోడ్డు వల్ల వేరొకరు వచ్చి ఢీకొనడంతో ఆయనకు తీ వ్ర గాయాలయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని స్థానికులు డిమాండ్‌చేస్తున్నారు.

చెట్టు పైనుంచి జారిపడిన గిరిజనుడికి గాయాలు



క్షతగాత్రుడికి ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చెట్టునుంచి జారి పడి గిరిజనుడికి గాయాలయ్యాయి. మండలంలోని లైగండ పంచాయతీ ఇసుకగరువు గ్రామానికి చెం దిన తాంగుల ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఉదయం వంట చెరకు సేకరణకు చె ట్టు ఎక్కారు. గొడ్డలితో నరుకుతుండగా ప్ర మాద వశాత్తు చెట్టు నుంచి జారిపడ్డాడు. కుడి కాళ్లు విరిగి రక్తస్రావమైంది. కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. వాహన సిబ్బంది అర్జున్, శ్యామ్ వచ్చి క్షతగాత్రుడిని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

26వ రోజుకు చేరిన దీక్షలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయానికి సాగు భూములు ఇచ్చిన గిరిజనులు చేపడుతున్న ఆందోళన దీక్ష మంగళవారానికి 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధితులు డోంబు, రాంచందర్ మాట్లాడుతూ, పాఠశాల నిర్మాణానికి తాము భూములు ఇచ్చి ఏడేళ్లు కావస్తోందన్నారు. రాత పూర్వకంగా తమకు ఉపాధి కల్పిస్తామని అధికారులు ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదని వాపోయారు. తమను కాకుండా బయట వ్యక్తులకు లోపాయికారిగా పాఠశాలలో ఉపాధి కల్పించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇకనైనా సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

'జ్ఞానజ్యోతి'తో అంగన్‌వాడీల్లో బోధన మెరుగు

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి



మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి

పాడేరురూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల బోధనా సామర్థ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న జ్ఞానజ్యోతి ఇన్ సర్వీస్ సర్టిఫికెట్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి కోరారు. జాతీయ విద్యా విధానం 2020 విజన్ అమలులో భాగంగా అందించిన సామగ్రిని తరగతి గదిలో ప్రభావవంతంగా ఉపయోగించడానికి ఈ సర్టిఫికెట్ దోహదపడుతుందన్నారు. మంగళవారం స్థానిక శ్రీకృష్ణాపురం బాలికల పాఠశాలలో ఈశిక్షణను ఆ మె ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ విద్య పిల్లల సర్వతోముఖాభివృద్ధి కీలకమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నామన్నారు. అనంతరం ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ మాట్లాడుతూ "3 నుంచి 8 ఏళ్ల వయస్సు గల వారిలో నిరంతర అభివృద్ధికి వీలుగా వారి మెదడు పనిచేస్తోందన్నారు. 2026-27 నాటికి ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 8 ఏళ్ల వయస్సుగల పిల్లలు అందరూ వయసుకు తగినట్టుగా పునాది, అక్షరాస్యత సంఖ్యా జ్ఞానాన్ని పొందేలా చూడాలన్నారు. ఈ శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.ఝాన్సీరాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, స్కూల్ హెచ్ఎంలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు ఆటాపాటలతో పూర్వ ప్రాథమిక విద్య అందించనున్నట్టు స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో ఎ.లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం బాలిక ఆశ్రమ పాఠశాలలో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 120 డేస్ ఎస్ఏఎల్‌టీ శిక్షణను సీడీపీవో, ఎంఈవో సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు నూతన విద్యా పాలసీలో భాగంగా ఆరు రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు వలసమ్మ, రామలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదలకు తోడ్పాటునందించాలని స్థానిక ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ సూచించారు. అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాలను మంగళవారం ప్రారంభించారు. డుంబ్రిగుడ బాలురు, జాముగుడ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఆయన మాట్లాడారు పిల్లల్లో సమగ్ర అభివృద్ధితోపాటు ఆట,పాటలతో బోధనందించాలన్నారు. పౌష్టికాహారాన్ని చిన్నారులకు సక్రమంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, సీడీపీవో నీలిమ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ఇస్తున్నట్టు స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో పి. విజయ కుమారి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంఈవో ఎల్. రాంబాబుతో కలిసి సీడీపీవో శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యకర్తలు బాలబాలికలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈకార్యక్రమంలో డీఆర్‌పీ, ఐవీవీ సురేశ్ కుమార్, సూపర్‌వైజర్లు కొండమ్మ, మహాలక్ష్మి, బాలమణి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, డీఈవో భాను, బీపీసీ శేఖర్ పాల్గొన్నారు.



కొయ్యూరులో అవగాహన కల్పిస్తున్న పీవో

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

అనంతగిరి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న దాదాపు 10వేల మంది రైతులకు త్వరలో గుర్తింపు కార్డులు అందజేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరీ తెలిపారు. జీరాయితీ పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబరు ఉన్న రైతులకు గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. వీరు ప్రభుత్వ రాయితీలు, పథకాలను పొందేందుకు వీలవుతుందన్నారు.

వనభంగిలో వైద్య శిబిరం



వనభంగిలో చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిఖిల్

పెదబయలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలం వనభంగి పంచాయతీ కేంద్రంలో గత కొద్ది రోజులుగా మూడేళ్లలోపు నలుగురు చిన్నారులకు జలుబు,జ్వరం, దద్దుర్లతో బాధపడుతున్నారు. సమాచారం అందుకున్న పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ మంగళవారం గ్రామానికి వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారందిరికీ వైద్య పరీక్షలు నిర్వమించి మందులు పంపిణీ చేశారు. 12 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఇద్దరికి జ్వరం, కళ్లు ఎర్రబడటంతో అనుమానంగా భావించి మీజల్స్ పరీక్ష కోసం రక్తనమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్‌కుల్యాబ్‌కు తరలించినట్టు నిఖిల్ తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులకు సూచించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు,మూర్తి,రమ్య,రత్నాలమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతి



మృతుడు చిన్నబాబు (ఫైల్)

జి.మాడుగుల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన టీడీపీ నేత, మండలంలో తొలి ఫొటో గ్రాఫర్ సీదరి చిన్నబాబు మంగళవారం మృ తి చెందారు. గత మూడు రోజుల కిందట అనారోగ్యానికి లోనవడంతో ఆయనను విశాఖపట్నం కేజీహెచ్‌కు కుటుంబ సభ్యులు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన స్వస్థలం కుంబిడిసింగి పంచాయతీ రోలంగి పుట్టు గ్రా మం. చిన్నబాబు టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీలోనే కొనసాగుతూ వచ్చారు. అలాగే, తొలి ఫొటో గ్రాఫర్‌గా ఆయనకు ఈ ప్రాంతంలో గుర్తింపు ఉంది. దీంతో టీడీపీ నాయకులు, ఫొటో గ్రాఫర్లు, వివిధ వర్గాల ప్రజలు తీవ్ర సంతాపం తెలిపారు.

గిరిజన స్వ పరిపాలనకు పెసా చట్టం దోహదం



పాడేరులో శిక్షణకు హాజరైన పెసా కమిటీ, వార్డు సభ్యులు తదితరులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెసా చట్టంపై కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వాధికారులు అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు అన్నారు. షెడ్యూల్డ్ తెగల సాంస్కృతిక, పాలనా సంప్రదాయాలకు అనుగుణంగా రూపొందించిన పెసా చట్టం 1996పై మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెసా చట్టాన్ని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. అందుకు ప్రతీ ఒక్కరూ ఈ చట్టంపై అ వగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఆదివాసీలకు పూర్తి స్థాయిలో అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గిరిజనుల స్వపరిపాలనకు పెసా కమిటీలది కీలక పాత్ర అన్నారు. పెసా చట్టం పక్కాగా అమలు కోసం ఈ శిక్షణ కార్యక్రమాలను మండలంలో ఈ నెల 27వ తేదీ వరకు మాస్టర్ ట్రైనర్స్‌తో అందిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, పెసా కమిటీ ప్రతినిధులు 188 మంది శిక్షణ పొందారన్నారు. సామర్లకోటకు చెందిన ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ పి.చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్ వి.చిన్ని, నాగేశ్వరరావు, విజయబాబు, సత్యనారాయణ, కాసు, ప్రవీణ్‌కుమార్, మనోహర్, సుధాకర్, అశోక్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేశ్, ఏవో ఎ.మహేశ్వరరావు, ఎస్ఏ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జి.కె. వీధిలో మాట్లాడుతున్న పరిశీలకుడు నాగేశ్వరరావు

గూడెంకొత్తవీధి: పెసా చట్టాన్ని గ్రామ స్థాయిలో పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత కమిటీపై ఉన్నదని రాష్ట్ర పరిశీలకుడు కె.నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, డ్వాక్రా మహిళల కు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెసా కమిటీ ప్రతినిధులకు చట్టంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పెసా గ్రామ సభకు విశిష్ట అధికారాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులకు పూర్తి స్థాయిలో అందాలంటే కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు, ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: గిరిజన సహక్కులు, చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సామర్లకోట విస్తరణ కేంద్రం పర్యవేక్షకులు ప్రసాదు, శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న శిక్షణను వారు మంగళవారం పరిశీలించారు. పెసా హక్కులు, చట్టాల వలన కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు చిన్నాన్న, సింహాచలం, సత్యరంజన్ పాల్గొన్నారు.

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయంలోని పెసా చట్టంపై శిక్షణ మంగళవారానికి మూడో రోజుకు చేరుకుంది. చట్టం 1966 అమలుపై ఎంపీడీవో ఏవీవీ.కుమార్, అబ్జర్వర్ చంద్రశేఖరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ సభ్యులు, కార్యదర్శి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి: కలెక్టర్



రంపచోడవరంలో రక్తశిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ దినేశ్‌కుమార్, చిత్రంలో ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, తదితరులు

పాడేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానానికి ముందుకురావాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లాలోని రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆ ధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అత్యవసర రోగులు, బాధితులకు రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మూడేళ్లలో రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని 11 మండలాల పరిధిలో రక్తదాన శిబిరాలను విరివిగా నిర్వహించి 2,560 యూనిట్‌ల రక్తాన్ని సేకరించినట్టు చెప్పారు. అలాగే యువత అపోహలు వీడి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానానికి ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఈనెల 19 నాటికి జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీని ఏర్పాటు చేసి మూడేళ్లు అవుతుందన్నారు.

నేడు చింతూరులో రక్తదానం శిబిరం

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 19న రక్తాదాన శిబిరాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ సభ్యుడు బొర్రా నాగరాజు, సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి.గౌరిశంకరరావు, కోశాధికారి పి.సూర్యారావు, సభ్యులు ప్రసాద్‌నాయుడు, మణి, కోఆర్డినేటర్ లోహితాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.వసుధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అండాశయంలో తొమ్మిది కిలోల కణితి తొలగింపు

- అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో విజయవంతంగా శస్త్రచికిత్స



మహిళ పొత్తికడుపులో తొలగించిన కణితిని చూపుతున్న వైద్య నిపుణులు

అరకులోయ, ఫిబ్రవరి 18 ఆంధ్రజ్యోతి): డుంబ్రిగుడ మండలం బల్లగెడ్డ గ్రామానికి చెందిన 43 ఏళ్ల పాంగి చిలకమ్మకు స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసి తొమ్మిది కిలోల కణితిని వైద్యులు తొలగించారు. వివరాలివి.. చిలకమ్మ కొంతకాలంగా పొత్తికడుపు నొప్పి, వాపుతో బాధపడుతోంది. మంగళవారం ఆసుపత్రికి వచ్చి ఆ సుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ లగుడు రామును సంప్రదించడంతో ఆమెకు వైద్యపరీక్షలు జరిపారు. అనంతరం ఆమె పొత్తికడుపులో తొమ్మిది కిలోల బరువుగల అండాశయ కణితిని గుర్తించారు. జనరల్ సర్జన్ లగుడురాము ఆమెకు విజయవంతంగా శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించారు. ఈ ఆపరేషన్‌లో మత్తు వైద్యులు అప్పారావు, స్టాఫ్‌నర్సు మంగ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. గత ఆరునెలల్లో ఇలాంటి కేసులను కేజీహెచ్‌కు తరలించకుండా స్థానిక ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయడం ఇది రెండవదని సూపరింటెండ్ తెలిపారు. చాలా మేరకు ఆసుపత్రిలోనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు ఆయన వివరించారు.

గుండెపోటు రోగులకు తక్షణ వైద్యం

ఆసుపత్రిలో గుండెపోటుకు అత్యవసర వైద్యసేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ లగుడు రాము తెలిపారు. గుండెపోటువచ్చిన వారికి ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా తమ ఆసుపత్రికి తరలించాలన్నారు. ప్రాథమిక పరిక్షలు నిర్వహించి మొదటి గంటలోనే రూ.45వేల విలువైన టెనెక్టెప్లస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించి ప్రాణాపాయ స్థితినుంచి రోగిని కాపాడుతున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

పాడేరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత అన్నారు. కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా అమలు చేయాలని, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పని చేసి పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలన్నారు. అలాగే బ్యాలట్ బాక్సుల నిర్వహణ, సీలింగ్, బ్యాలట్ పత్రాలు వినియోగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిస్ట్రిబూషన్ కేంద్రం నుంచి పంపిణీ చేసే పోలింగ్ సామగ్రి సక్రమంగా ఉన్నదీ లేనిదీ ముందుగానే సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయానికి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో రిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్, మాస్టర్ ట్రైనర్ చెల్లయ్య, సూపరింటెండెంట్ సీహెచ్.తిరుమలరావు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని ఆందోళన



మాట్లాడుతున్న డీఆర్వో కె.పద్మలత, పక్కన ఎస్‌డీసీ లోకేశ్

పాడేరురూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కామన్ పీజీ సెట్ ఆలోచన విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘం నాయకులు ఐటీడీఏ ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేపటారు. అనంతరం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో డాక్టర్. ఎంజే.అభిషేక్ గౌడకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ సెట్ రద్దు చేసి, ఏ యూనివర్సిటీకి ఆ వర్సిటీల్లో ప్రవేశ పరీక్షలను నిర్వహించాలని కోరారు. ప్రైవేటు వర్సిటీలకు కొమ్ముకాస్తూ విద్యార్థుల జీవితాలను నాశనం చేయవద్దని కోరారు. ఎన్నికల ముందు పీజీ సెట్‌పై ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. 2021కి ముందు ఆయా యూనివర్సిటీల్లోనే పీజీ ప్రవేశాలు నిర్వహించే వారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతనూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా కామన్ పీజీ ప్రవేశాలకు ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించడం ప్రారంభించారన్నారు. దీనివల్ల 2021 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల్లో 30 నుంచి 40 శాతం ప్రవేశాలు లేకుకుండాపోయాయన్నారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

100 మందికి నేత్ర వైద్య పరీక్షలు



పినకోట పీహెచ్‌సీ వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అనంతగిరి, ఫిబ్రవరి 18 (ఆం ధ్ర జ్యోతి): మండలంలోని పినకోట పీహెచ్‌సీ వద్ద మంగళవారం విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి నిర్వహించి వైద్య శిబికానికి విశేష స్పందన లభించింది.. 100 మంది ఈ శిబిరంలో పాల్గొనగా, 28 మందికి కళ్లద్దాలు, నలుగురికీ ఆపరేషన్ కు ఎంపిక చేశారు. పినకోట పీహెచ్‌సీ వైద్యాధికారి రూప్‌చంద్, వెంకటేశ్, కంటి వైద్యనిపుణులు రమణబాబు, ఎంపీహెచ్ఈవో గంగరాజు, రామకృష్ణ, హెచ్‌వీ సావిత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో ఎస్పీ ప్రత్యేక సమావేశం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో మంగళవారం ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా, వినియోగం నివారణ, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళలు, బాలల హక్కులు, రహదారి భద్రతా నియమాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

బాలలపై దాడుల నిరోధానికి కృషిచేయాలి

▸▸ ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి



బాలల పరిరక్షణపై తీసుకుంటున్న చర్యలను తెలుసుకుంటున్న ఆర్జేడీ

కొత్తూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బాలలపై దాడుల నిరోధానికి కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాంతీయ సహాయ సంచాలకులు జి.చిన్మయిదేవి సూచించారు. అనకాపల్లి పట్టణంలోని ప్రత్యేక దత్తత, జిల్లా బాలల పరిరక్షణ విభాగాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక దత్తత విభాగంలో పిల్లలు, సిబ్బంది వివరాలు, వారి పనితీరు విషయాలపై చర్చించారు. జిల్లాలో బాలల సంరక్షణ విభాగాన్ని కూడా సందర్శించి వారి పనితీరుపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి కె.అనంతలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కిశోరి వికాశం, స్పాన్సర్‌షిప్ పథకంపై అవగాహన కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలలపై లైంగిక దాడులు నివారణపై ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆర్జేడీ చిన్మయిదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎల్.సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణకు రెవెన్యూ అడ్డుకట్ట

▸▸ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన అధికారులు



గెడ్డవాగు వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

పరవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సినిమా హాలు జంక్షన్ సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆనుకొని సర్వే నంబర్ 206లోని గెడ్డవాగును ఆక్రమించి మంగళవారం నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని స్థానికులు పరవాడ తహసీల్దార్ ఎస్‌వీ.అంబేడ్కర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆర్‌ఐ సురేశ్, వీఆర్వో సత్యనారాయణ, పలువురు తలయారీలను తహసీల్దార్ అక్కడికి పంపించి ఆక్రమణను అడ్డుకున్నారు. గెడ్డవాగులో నిర్మించిన గోడను కూలదోశారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడం చట్టరీత్యా నేరమని ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. గెడ్డ వాగులో ఎవరైనా నిర్మాణాలు జరిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఘనంగా ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలు



తాళ్లపాలెంలో ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన కేకు కట్ చేస్తున్న కూటమి నేతలు



సీఎం రమేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీలా గోవింద్

అనకాపల్లి టౌన్/కశింకోట/కొత్తూరు/తుమ్మపాల, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): ఎంపీ సీఎం రమేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి పట్టణంతో పాటు పలు గ్రామాలు, కశింకోట మండలంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, మండల అధ్యక్షుడు అప్పికొండ అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ, నాయకులు కలగ సోమేశ్వరరావు, కలగ గోవింద ఎంపీ రమేశ్ జన్మదిన కేకును కట్ చేశారు. అలాగే వెంకుంపాలెం హృదయశాంతి వృద్ధాశ్రమంలో టీడీపీ శ్రేణులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు పచ్చికూర రాము, బుద్ద శంకరరావు, కె.జగదీశ్, ఎ.నారాయణరావు, చందక నర్సింగ్, బాబ్జీ పాల్గొన్నారు. ఎంపీ రమేశ్ క్యాంపు కార్యాలయంలో 60 కిలోల కేక్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ తదితరులు కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 42 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి హరి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ నేత నీలబాబు పాల్గొన్నారు. అలాగే టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కే కేవీఏ నారాయణరావు ఆధ్వర్యంలో వేల్పులవీధి షిర్డీసాయి ఆలయంలో 108 కొబ్బరికాయలతో అభిషేకం చేయించి పూజలు నిర్వహించారు. కశింకోట బాల సదన్, బాలుర వసతి గృహాల్లో టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెదపాటి కల్యాణి ఆధ్వర్యంలో ఎంపీ రమేశ్ జన్మదిన కేకును కట్ చేశారు. అలాగే విద్యార్థులకు అన్నదానం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా కన్వీనర్ బత్తుల లక్ష్మి, మండల సమైక్య అధ్యక్షురాలు సీరం వెంకటలక్ష్మి పాల్గొన్నారు. జోగారావుపేట గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ కేట్ కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా కమ్మాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అనకాపల్లి వంద పడకల ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షుడు రమేశ్, సెక్రటరీ కొల్లి శ్రీను, కోశాధికారి డి.వెంగళరావు పాల్గొన్నారు. ఎంపీ సీఎం రమేశ్‌కు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం హైద్రాబాద్‌లోని సీఎం రమేశ్ స్వగృహంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. పీలా వెంట ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వెంగమాంబ శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

▸▸ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా



పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పించాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. మంగళవారం పొద్దుపోయిన తరువాత స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే మహిళల ఫిర్యాదుల పట్ల తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పెండింగ్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి వాటి పురోగతిపై అధికారులకు సూచనలు చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించడంలో భాగంగా మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే మహిళలు, వారు చేసే ఫిర్యాదుల పట్ల తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే మహిళలతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినాలని, ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించి చట్టపరిధిలో వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతేకాకుండా విద్యా సంస్థలు, మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది సందర్శించి. వారికి రక్షణగా నిలిచే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఆపద సమయంలో మహిళల సహాయం పొందే విధానం పట్ల అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్‌ల్లో సందర్శించి ప్రజలు, మహిళలు, విద్యార్థినులతో మమేకమై వారికి అర్థమయ్యే రీతిలో మహిళల రక్షణకు బాసటగా నిలిచే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు యమున, ఆలీ ఫరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఎస్పీ ఎన్టీఆర్ వైద్యాలయంలోని డి-అడిక్షన్ సెంటర్‌ను ఎస్పీ సందర్శించారు. అక్కడ రోగుల ఆరోగ్య పరిస్థితి, చికిత్స విధానాలు గురించి వైద్యులు డాక్టర్ కృష్ణచైతన్యను అడిగి తెలుసుకున్నారు. డి-అడిక్షన్ సెంటర్‌లో అందిస్తున్న వైద్యం, సేవలు గురించి తెలుసుకున్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ కృష్ణచైతన్యకు సూచించారు. అలాగే వార్డులను పరిశీలించారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలుచేయాలి

▸▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

తుమ్మపాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా కోడుగంటి గోవిందరావు 11వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల మానసిక సంక్షోభ స్థితి కారణంగానే నేడు క్రాప్ హాలీ డే దుస్థితి దాపురించిందన్నారు. ఈ పరిస్థితుల నుంచి రైతులు బయట పడాలంటే జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు కచ్చితంగా అమలు చేయాలన్నారు. భూమి తప్ప ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసే పరిశ్రమలు ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. అలాగే అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో రైతు సంఘాల నిర్మాణం, వన సంరక్షణ సమితి నిర్మాణం, సుజల స్రవంతి కోసం అహర్నిశలు శ్రమించిన గొప్ప వ్యక్తి కోడుగంటి గోవిందరావు అని అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, నాయకులు ఎస్.సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, బూసి పరమేశ్వరి, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెంలో క్షయపై అవగాహన సదస్సు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధిపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సందస్సులో క్షయ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎంఎస్‌వీకే బాలాజీ, అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో కఫం పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధితో మందులతో పూర్తిగా తగ్గుముఖం పడుతుందని వివరించారు. ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సూర్యనారాయణ, డాక్టర్ శ్రావణి, వైద్య సిబ్బంది రామకృష్ణ, యల్లాజీ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దుర్గమాంబ జాతర

▸▸ భారీ ఎత్తున ఏర్పాట్లు



పరవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలపాక పంచాయతీ పరిధిలో స్వయంభూవరం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతరను బుధ, గురువారాల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి అమ్మవారి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. బుధ, గురువారాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

పరవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు పథకం కార్మికులతో కలిసి మంగళవారం మండల విద్యా శాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించడంతో పాటు బకాయి జీతాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనం నెలకు రూ.10 వేలు ఇవ్వాలని, ఐడీ కార్డులు, బీమా సౌకర్యాన్ని కూడా కల్పించాలని విన్నవించారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాన్ని కూడా కల్పించాలని కోరారు. అనంతరం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భోజన పథకం కార్మిక సంఘ సభ్యులు వరలక్ష్మి, నూకరత్నం, వై.లక్ష్మి, దేముడమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 రవీంద్రబాబు

సబ్బవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవోలు ఎల్.లక్ష్మణరావు, జె.రవీంద్రబాబు ప్రారంభించారు. స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమలులో భాగంగా పునాది, అభ్యాసన, భాషా సంఖ్య, జ్ఞానంలో అంగన్వాడీ కేంద్రాల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు, 22 నుంచి 25వ తేదీ వరకూ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో లలితకుమారి, ప్రధానోపాధ్యాయురాలు రాధాకుమారి, పలువురు డీపీఆర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రామచంద్రమ్మ పండుగ

భారీగా తరలివచ్చిన భక్తులు.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తదితరులు

పరవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోన 14 గ్రామాల ఆరాధ్యదైవం, జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులతో పాటు ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు దంపతులు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు వీరికి ప్రసాదాలు పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా వీధుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఆకట్టుకున్నాయి. అలాగే భారీ హోర్డింగ్‌లు అలరించాయి. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించి ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మల్లికార్జునరావు బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు





విద్యుత్ కాంతులతో దగదగా మెరిసిపోతున్న అమ్మవారి ఆలయం... పూజలు అందుకుంటున్న దుర్గమాంబ అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తీర్థ మహోత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం సబ్బవరంలో దుర్గామాంబ అమ్మవారు, ఆరిపాక దగ్గర టెక్కలిపాలెం జంక్షన్ వద్ద కొలువుదీరిన పైడితల్లి అమ్మవారు, బుదిరెడ్లపాలెంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవాలను ప్రజలు సందడిగా జరుపుకున్నారు. దుర్గామాంబ అమ్మవారిని ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు పిబివిఎస్ఎన్.రాజు, ఇందలి రమణ, కర్రి కనకరాజు, ఎం.మహాలక్ష్మీనాయుడు, బుదిరెడ్ల కనకరాజు, బర్ల రమణ, కోరాడ శ్రీను, శేఖర్, పడాల శ్రీను, జెట్టి ప్రసాద్, దెడ్డం ప్రసాదరావు, రేసుపూడి రమణ, పద్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నల్లమారమ్మ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన నల్లమారమ్మ

కొత్తూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం, రామభద్రపురం, బీఆర్‌టీ కాలనీలలో నల్లమారమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామున నుంచి పలు విశేష పూజలు చేశారు. జాతరను పురస్కరించుకొని అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహిళలకు అమ్మవారికి పసుపు, కుంకుమ నూతన వస్త్రాలను సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. ప్రజాప్రతినిధులు అమ్మవారికి దర్శించుకున్నారు.

ఇంటర్వ్యూ..

దొంగతనాల నిరోధానికి పటిష్ట నిఘా

-పిన్నింటి రమణ, సీఐ, సబ్బవరం



సబ్బవరంలో దొంగతనాలు, జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం, గ్రావెల్/మట్టి అక్రమ రవాణా నిరోధానికి కమిటీ వేసి దాడులు చేస్తున్నాం. అలాగే ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. నైట్ బీట్‌తో ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: గంజాయి రవాణా అడ్డుకట్టకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీల ద్వారా గంజాయి రవాణా సమాచారం సేకరిస్తున్నాం, జిల్లాలో అత్యధికంగా 1600 కిలోల గంజాయి పట్టుకున్నాం.

ప్ర: మండలంలో మద్యం బెల్టు దుకాణాల నిరోధానికి ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జ: మద్యం బెల్టు షాపుల నివారణకు గ్రామాల్లో పెద్దలకు అవగాహన కల్పిస్తున్నాం. వేలం పాట నిర్వహించినట్టు సమాచారం వస్తే కేసులు నమోదు చేస్తాం. గత ఏడాది 65, ఈ ఏడాది 20 బెల్టు కేసులు నమోదు చేశాం.

ప్ర: మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాల అడ్డుకట్టకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: గ్రావెల్/మట్టి అక్రమ రవాణాకు రెవెన్యూ, పోలీసు, మైన్స్ శాఖలు సంయుక్తంగా కమిటీ వేసి దాడులు చేస్తున్నాం. గత ఏడాది 25 వాహనాలు సీజ్ చేశాం. ఇటీవల రెండు ఎక్స్‌కవేటర్లు, లారీలు సీజ్ చేశాం.

ప్ర: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: హైవే మొబైల్ టీములు ఏర్పాటు చేయడంతో పాటు వాహన చోదకులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. రాంగ్ పార్కింగ్‌లు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయి.

ప్ర: గ్రామాల్లో దొంగతనాల నివారణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జ: దొంగతనాల నివారణకు డే/నైట్ బీట్ ఏర్పాటు చేసి నిఘా పెడుతున్నాం. రాత్రి పూట అనుమానితులను స్టేషన్‌కు తీసుకొచ్చి వేలు ముద్రలు తీసుకొని పరిశీలన చేస్తున్నాం. గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

-సబ్బవరం, ఆంధ్రజ్యోతి

గ్రావెల్ లారీ పట్టివేత



పోలీసులు పట్టుకున్న గ్రావెల్ లారీ ఇదే..

కొత్తూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని వేటజంగాలపాలెంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని పట్టుకున్నామని రూరల్ ఎస్ఐ జి.రవి కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా ఎటువంటి బిల్లులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నట్టు తమ విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు మైన్స్ అధికారులకు గ్రావెల్‌తో లారీని అప్పగించామని ఆయన చెప్పారు.

మామిడిపాలెంలో పొలం పిలుస్తోంది..

తుమ్మపాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి పి.రంగాచారి మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటే 11 నంబర్లు గల కోడ్‌తో ఈ-కార్డు వస్తుందన్నారు. దీనిద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. బ్యాంకు రుణాలు, విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారాలు సులువుగా పొందవచ్చని చెప్పారు.

'రఘువర్మను గెలిపించాలి'

తుమ్మపాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ కోరారు. మండలంలోని కొప్పాక, కొండుపాలెం, మార్టూరు, మామిడిపాలెం, దిబ్బపాలెం, సీతానగరం, కూండ్రం, మర్రిపాలెం, తుమ్మపాల తదితర ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రఘువర్మ కచ్చితమైన పోరాటాలు సాగిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కొణతాల గణేశ్, నూకేశ్, సత్యం, సాంబమూర్తి, పీవీ.రమణ, వి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



అనకాపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు.. ఏపీటీఎఫ్ తరఫున పోటీలో ఉన్న పాకలపాటి రఘువర్మకు టీడీపీ మద్దతు ప్రకటించిందన్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, అన్ని స్థాయిల టీడీపీ ముఖ్య నాయకులు పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న స్వల్పకాలిక కోర్సుల శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది వ్యవధి గల ఇండస్ట్రియల్ సేఫ్టీ (60 సీట్లు), ఆరు నెలల వ్యవధి గల ఫైర్ సేఫ్టీ (30), నాలుగు నెలల వ్యవధితో ఆఫీస్ ఆటోమేషన్ (20), మూడు నెలల వ్యవధితో కెమికల్ సూపర్ వైజరీ ప్రోగ్రాం (20) సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి, డిగ్రీ ధ్రువపత్రాలతో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ పనుల కారణంగా రద్దు చేసిన ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519/18520) రైళ్లను పునరుద్ధరించినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 20న విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), తిరుగు ప్రయాణంలో ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18520) ఈ నెల 21న షెడ్యూల్ ప్రకారం యథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

చర్లపల్లి-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైలు

ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07025 నంబరు గల రైలు ఈ నెల 21వ తేదీ రాత్రి 9.15 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07026 నంబరు గల రైలు ఈ నెల 22న మధ్యాహ్నం 2.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి సాయంత్రం 4.45 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుతుంది. ఈ రైళ్లు నల్లగొండ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, అన్నవరం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలు రైళ్లు రద్దు

నిర్వహణ పనుల దృష్ట్యా విశాఖ నుంచి షాలిమార్ వెళ్లే 22854 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలును బుధవారం (19న) రద్దు చేశారు. ఈ నెల 21న సంత్రాగచ్చి-ఎంజీఆర్ చెన్నై ఎక్స్‌ప్రెస్ (22807), 23న ఎంజీఆర్ చెన్నై-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22808)ను రద్దు చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

విస్తరిస్తున్న ప్లైవుడ్ పరిశ్రమ

(భీమునిపట్నం రూరల్, ఆంధ్రజ్యోతి)

» భీమిలి నియోజకవర్గంలో విరివిగా ఏర్పాటు
» మరిన్ని నెలకొల్పేందుకు ఔత్సాహికుల యత్నాలు
» విశాఖ పోర్టు నుంచి ముడి సరకు దిగుమతి
» ఉత్పత్తుల ఎగుమతికి వీలుగా రవాణా మార్గాలు
» స్థానికులకు పెద్దఎత్తున లభిస్తున్న ఉపాధి

అనేక రకాల గృహోపకరణాలు, ఆఫీసు ఫర్నిచర్ ఇతర అవసరాలకు కావాల్సిన ప్లైవుడ్ తయారీ పరిశ్రమకు భీమిలి నియోజకవర్గం చిరునామాగా మారుతోంది. ఇక్కడ ఇప్పటికే పదికి పైగా ప్లైవుడ్ పరిశ్రమలు నెలకొల్పగా, మరిన్ని ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ముందుకువస్తున్నారు. ఉత్తరాదికి చెందిన పారిశ్రామిక వేత్తలు ప్రారంభంలో ఈ పరిశ్రమలను ఏర్పాటుచేయగా, మెలకువలను ఔపోసన పట్టిన స్థానికులు ప్లైవుడ్ పరిశ్రమల ఏర్పాటుకు యత్నిస్తున్నారు. దీంతో పాటు పరిశ్రమలను ఏర్పాటుచేసే ప్రాంతాల్లోని వారికి ఉపాధి కూడా లభిస్తోంది. తయారైన ప్లైవుడ్ అనేక ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండడంతో ఏటా సుమారు రూ.100 కోట్ల కంటే ఎక్కువగానే వ్యాపారం జరుగుతోందని అంచనా.



యంత్రం నుంచి బయటకు వస్తున్న పలుచని పొరలు



క్రదుంగలను పలుచగా కోస్తున్న దృశ్యం



యంత్రాల మధ్యలో దుంగలను ఉంచుతున్న కార్మికులు

నియోజకవర్గంలోని భీమిలి, బొడ్డపాలెం, లొడగలవానిపాలెం, దాకమర్రి, వెల్లంకి తదితర ప్రాంతాల్లో ప్లైవుడ్‌ను తయారుచేసే పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటిలో వందలాది మంది పనిచేస్తున్నారు. అత్యధికులు బీహార్, ఒడిశా వాసులు. తయారీలో మెలకువలు తెలుసుకుంటున్న స్థానికులకు కూడా ఇటీవల ఉపాధి లభిస్తోంది. ఆయా పరిశ్రమలను నిర్వహిస్తున్నవారిలో ఉత్తరాదికి చెందిన వారు ఎక్కువ. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలకే అధికశాతం ఎగుమతులు జరుగుతున్నాయి. ప్లైవుడ్ పరిశ్రమలకు ప్రధాన ముడిసరకును రంగూన్, బర్మా, సింగపూర్ తదితర ప్రాంతాల నుంచి విశాఖ పోర్టుకు దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడి నుంచి ఆయా పరిశ్రమలకు లారీల్లో కలప చేరుతోంది.

తయారీ విధానం

సుమారు వంద నుంచి 300 సంవత్సరాల వయసు కలిగిన వృక్షాలను వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఈ దుంగలను ఆరు అడుగుల ముక్కలుగా రంపంతో కోస్తారు. వీటిని ప్రత్యేక యంత్రంలో పెట్టి కత్తిరిస్తారు. యంత్రంలో గుండ్రంగా తిరుగుతున్న మాను నుంచి పలుచని పొరను తీస్తారు. ఒక మీటరు విస్తీర్ణం కలిగిన మాను ద్వారా సుమారు 200 వరకు పొరలు వస్తాయి. ముందుగా ఈ పొరలను ఆరబెడతారు. తర్వాత ఒకదానిపై మరొక దానిని ఉంచి, ప్రత్యేక గమ్‌తో అతికించి అట్టలుగా రూపొందిస్తారు. ఈ పనులకు ముందు మానులను పరిశ్రమలలో ఏర్పాటుచేసిన చిన్నచిన్న నీటి మడుగులలో నెలరోజుల పాటు నానబెడతారు. బాగా నానిన తర్వాత పెద్ద యంత్రాలలో కోత కోస్తారు. దీనివల్ల సులభంగా పల్చని పొరలు వస్తాయి. కోత కోసిన తర్వాత ఆరబెడతారు. పలుచని కాగితం వంటి ముక్కలను వరుసగా అతికిస్తారు. ఇలా తయారుచేసిన ప్లైవుడ్ ముక్కలను మూడురకాలుగా వేరు చేస్తారు. మొదటిరకం ఎక్కువ ధర పలుకుతుండగా దీంతో తలుపులు ఇతర బలమైన వస్తువులను తయారుచేస్తారు. రెండు, మూడు రకాలకు చెందిన ప్లైవుడ్‌ను తక్కువ ధరకు విక్రయిస్తారు వాటిని స్థానిక అవసరాలకు వినియోగిస్తుంటారు.

ముందుకు వస్తున్న ఔత్సాహికులు

నియోజకవర్గంలో ప్లైవుడ్ పరిశ్రమ విస్తరిస్తోంది. ఇప్పటికే కొత్తవలస, గారిపేట, బొడ్డపాలెం, లొడగలవానిపాలెం, వెల్లంకి తదితర ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. వీటిలో రెండింటిని ఎన్‌ఆర్‌ఐలు నిర్వహిస్తున్నారు. ఈ పరిశ్రమల్లో ప్లైవుడ్ తయారీకోసం స్థానికంగా వందలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలు భీమిలి, ఆనందపురం మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. విశాఖ పోర్టుకు షిప్పులద్వారా దిగుమతి అయ్యే దుంగలను పరిశ్రమల వరకు సులభంగా రవాణా చేసే వీలుండడం, ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు జాతీయ రహదారి, విశాఖ, విజయనగరంలో రైల్వేస్టేషన్లు అందుబాటులో ఉండడం పరిశ్రమ విస్తరణకు కారణాలుగా పేర్కొంటున్నారు. కాగా గంభీరం పారిశ్రామిక పార్కులో ఇటీవల రెండు ప్లైవుడ్ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేశారు. భీమిలి మండలంలో దాకమర్రి, మహారాజుపేట అమనాం, తగరపువలస సమీపంలో కొంతమంది ఈ పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

అనుబంధ పరిశ్రమలు అవసరం

ప్లైవుడ్ పరిశ్రమలకు అనుబంధంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశం ఉంది. కానీ ఔత్సాహికులు ముందుకురావడం లేదు. పెందుర్తి, అగనంపూడి ప్రాంతాలలో కొన్ని అనుబంధ పరిశ్రమలున్నా, ఈ ప్రాంతంలో ఏర్పాటుకు ముందుకురావడం లేదంటున్నారు. అనుబంధ పరిశ్రమలు ఏర్పాటైతే మరింతమంది స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయంటున్నారు.

క్రైం... crime news

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మన్యం జిల్లా సాలూరు మండలం దుగ్గసాగరానికి చెందిన వాకపల్లి రమేష్ (19)సెజ్‌లో గల లారస్ కర్మాగారంలో పనిచేస్తున్నాడు. అచ్యుతాపురం మండలం కోనెంపాలెంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం బైక్‌పై అచ్యుతాపురం నుంచి గాజువాక వెళ్తున్నాడు. మడుతూరు జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్‌ని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొంది. దీంతో రమేష్ అక్కడికక్కడే చనిపోగా ఢీకొన్న మరో వ్యక్తికి కాలువిరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

» మృతుడిది రాంబిల్లి మండలం వెంకయ్యపాలెం



మైలపల్లి మనోహర్ (ఫైల్ ఫొటో)

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై షీలానగర్ జంక్షన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలేనికి చెందిన మైలపల్లి మనోహర్ (23) నగరంలోని మెరినో ఇండస్ట్రీస్ లిమిటెడ్ సేల్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని పల్సర్ బైక్‌పై రాంబిల్లిలోని తన ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో షీలానగర్ జంక్షన్ దాటిన తరువాత వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ మనోహర్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన మనోహర్ తలకు తీవ్రగాయమయింది. అతడు హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. కొన ఊపిరితో ఉన్న మనోహర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడితో అనకాపల్లి రూరల్ పోలీసులు

కొత్తూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పెద్దమాకవరం గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడ్ని అరెస్టు చేశామని రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం విలేకరు లతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 2న పెద్ద మాకవరం గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఇంట్లో రెండు తులాల బంగారు ఆభరణాలు, ఒక మోటారు సైకిలు దొంగతనం జరిగినట్టు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు ఎస్ఐ జి.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, మాకవరం గ్రామానికి చెందిన గెంజి మంగరాజును చోరీ చేసినట్టు తేలిందన్నారు దీంతో అదే గ్రామంలో మంగళవారం అతన్ని అరెస్టు చేశామన్నారు. నిందితుడి నుంచి బంగారు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించడంలో హెడ్ కానిస్టేబుల్ వై.సోంబాబు, కానిస్టేబుల్ ఎం.బాలకృష్ణ కీలక పాత్ర పోషించారని అభినందించారు.

సూర్యఘర్‌కు అరకొర స్పందన

... 5వ పేజీ తరువాయి

అమర్చుకోవచ్చు. ఒక కిలో వాట్ సౌర శక్తితో రోజుకి నాలుగు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రెండు కిలో వాట్లకు ఎనిమిది యూనిట్లు చొప్పున నెలకు 240 యూనిట్లు, మూడు కిలో వాట్ల యూనిట్లు అయితే రోజుకి 12 యూనిట్ల చొప్పున నెలకి 360 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. సోలార్ రూఫ్ టాప్ యూనిట్‌ను బిగించేటప్పుడు పాత మీటర్‌ను తీసేసి ఈపీడీసీఎల్ అధికారులు కొత్తగా నెట్ మీటర్ బిగిస్తారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ రీడింగ్, వినియోగదారుడు వాడుతున్న విద్యుత్ రీడింగ్ కూడా నెట్ మీటరులోనే కనిపిస్తుంది. నెలలో గృహ విద్యుత్ వినియోగం పోను మిగిలిన విద్యుత్ యూనిట్ డబ్బులు లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతాయి.

ప్రజల నుంచి అరకొర స్పందన

గత ఏడాది ప్రారంభించిన 'ప్రధానమంత్రి సూర్యఘర్' పథకం వచ్చే ఏడాది మార్చితో ముగుస్తుంది. అనకాపల్లి జిల్లాలో ఎనిమిదివేల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సంబంధిత పోర్టల్‌లో ఇంతవరకు 5,855 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 644 మంది మాత్రమే డబ్బులు కట్టారు. ఇందులో 440 మంది ఇళ్లపై సోలార్ యూనిట్లు, నెట్ మీటర్లు బిగించారు. ఇక డివిజన్‌ల వారీగా పరిశీలిస్తే.. ఈపీడీసీఎల్ నర్సీపట్నం డివిజన్‌లో 3 వేల యూనిట్లకుగాను 1,906 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 199 మంది డబ్బులు చెల్లించగా, 137 మంది ఇళ్లకు సోలార్ యూనిట్లు బిగించారు. అనకాపల్లి డివిజన్ లక్ష్యం 3 వేల యూనిట్లుకాగా, 1,046 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 223 మంది డబ్బులు చెల్లించగా, 165 ఇళ్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. కశింకోట డివిజన్ లక్ష్యం 2 వేలుకాగా 2,906 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే వీరిలో 222 మంది మాత్రమే డబ్బులు కట్టారు. 138 మంది ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు బిగించారు.

దీర్ఘకాలంలో ఎంతో ఉపయోగం

వీడీవీ రామకృష్ణారావు, ఈపీడీసీఎల్ ఈఈ, నర్సీపట్నం



సోలార్ పవర్ వల్ల విద్యుత్ బిల్లు భారీగా తగ్గిపోతుంది. మొదట పెట్టుబడి అధికంగా అనిపించినప్పటికీ భవిష్యత్తులో ఊహించని ప్రయోజనం చేకూరుతుంది. సోలార్ రూఫ్ టాప్‌ల విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు. డ్వాక్రా మహిళలకు లబ్ధిదారుని వాటా డబ్బులు కూడా బ్యాంకులు రుణంగా ఇస్తాయి. పదేళ్లలో బ్యాంకు అప్పు తీరిపోతే 15 సంవత్సరాలపాటు ఇంటికి ఉచితంగా విద్యుత్ పొందడంతోపాటు మరికొంత సొమ్ము ఈపీడీసీఎల్ నుంచి వస్తుంది.

విద్యుత్ సేవల్లో లోపాలుంటే సంప్రదించండి

» ప్రజలకు సీజీఆర్ఎఫ్ చైర్మన్ సూచన



వినియోగదారు నుంచి ఫిర్యాదు అందుకుంటున్న చైర్మన్ సత్యనారాయణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) చైర్మన్, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. తాటిచెట్లపాలెం సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డు మాదేటి గార్డెన్స్‌లోని గౌరీ పరమేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లింగ్‌లో లోపాలు, విద్యుత్ తీగలు (కేబుల్), ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు లేదా కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి అమర్చడం, మీటర్లు కాలిపోవడం, విద్యుత్ ఓల్టేజ్ హెచ్చుతగ్గులు, మీటర్లలో లోపాలు, కొత్త సర్వీసులు, అదనపు లోడు మంజూరు, యజమాని పేరు, కేటగిరి, ఇతర మార్పిడి అంశాలు, వినియోగదారుల బిల్లుల్లో లోపాలు సరి చేయడం, బిల్లుల చెల్లింపు తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ తదితర అంశాలపై స్పందించనున్నట్లు చెప్పారు. విద్యుత్ సిబ్బంది సేవలు సక్రమంగా అందించకపోతే ఆ అంశాలను న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించి వినియోగదారులకు సత్వర న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. వినియోగదారుని సమస్యలను నిర్దేశిత కాలంలో విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పరిష్కరించకపోతే న్యాయస్థానం ఇరువురి వాదనలు విని, వినియోగదారునికి సమస్య పరిష్కారంతో పాటు సేవ అమలులో జాప్యానికి పరిహారం చెల్లించేలా తీర్పు ఇస్తుందన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ బాబర్, సులేఖ రాణి, స్వతంత్ర సభ్యుడు ఎన్.మురళీకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ధర్మరాజు, డిప్యూటీ ఈఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఏయూ వీసీగా రాజశేఖర్

... 5వ పేజీ తరువాయి

వర్సిటీ పాలనను గాడిలో పెట్టవచ్చునని ప్రభుత్వం భావించినట్టు చెబుతున్నారు. ఏది ఏమైనా తాజా నిర్ణయంతో వర్సిటీ ప్రతిష్ఠ ఇనుమడిస్తుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రాజకీయాలకు, వ్యక్తిగత అజెండాలకు దూరంగా వర్సిటీ పాలన సాగేందుకు అవకాశం ఉంటుందని విశ్లేషిస్తున్నారు.

కీలక బాధ్యతలు

ప్రొఫెసర్ రాజశేఖర్ అనేక కీలక బాధ్యతలను నిర్వర్తించారు. గేట్-2014 ఆర్గనైజింగ్ చైర్మన్‌గా, 2014లో గేట్ అకడమిక్ స్టాండింగ్ కమిటీ కన్వీనర్‌గా, 2018-19లో ఐఐటీ ప్లేస్‌మెంట్ కమిటీ కన్వీనర్‌గా, 2020లో జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ సభ్యుడిగా బాధ్యతలను నిర్వర్తించారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌గా, ప్లానింగ్ అండ్ కో-ఆర్డినేషన్ విభాగం డీన్‌గా, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ డీన్‌గా, టెక్నాలజీ విజన్-2047 వర్క్‌షాప్ చైర్మన్‌గా, ఐఐటీ ఖరగ్‌పూర్ విజన్-2030 డాక్యుమెంట్ కమిటీ చైర్మన్‌గా, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ చైర్మన్‌గా సేవలు ఆయన అందించారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

... 5వ పేజీ తరువాయి

ముద్దాయి నవీన్‌కు 20 ఏళ్ల జైలు రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ సొమ్ముతోపాటు ప్రభుత్వం తరఫున మరో రూ.7 లక్షలను బాధితురాలికి పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలి తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి వాదనలు వినిపించారు. ఆయనతోపాటు సబ్బవరం పోలీసులను ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

... 5వ పేజీ తరువాయి

ప్రక్రియలో చిన్నపాటి తప్పిదానికి కూడా తావివ్వొద్దని చెప్పారు. బ్యాలట్ పత్రాల పంపిణీ నుంచి పోలింగ్ ముగిసి, బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరే వరకు మొత్తం బాధ్యత అంతా ప్రిసైడింగ్ అధికారిదేనని ఆమె స్పష్టం చేశారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

గ్రావెల్ మాఫియా

» కూటమి నేతల కనుసన్నల్లోనే వ్యవహారం
» ఎస్.కోట, ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక, పెందుర్తి మండలంలో మట్టి తవ్వకాలు
» ఎవరూ అడ్డుకోకుండా 'గ్రీన్ ఛానల్' ఏర్పాటు
» అడ్డగోలు సంపాదన కోసమే వైసీపీ నుంచి పలువురు జనసేనలో చేరిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఇసుకను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అధికారిక ముద్రతో అమ్ముకుంటున్నారు. వీరి వాహనాలను ఎవరూ అడ్డగించకుండా ఉండేందుకు కొందరు అధికారులు ఏకంగా 'గ్రీన్ ఛానల్' ఏర్పాటుచేయడం గమనార్హం.

ఏ ప్రభుత్వం వచ్చినా నగర శివారు నియోజకవర్గ నాయకులు ఇసుక, మట్టి తవ్వకాలపైనే దృష్టి పెడుతున్నారు. ఇప్పుడు పెందుర్తిలోను అదే జరుగుతోంది. రాంబిల్లిలో తూర్పు నౌకాదళం నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ స్థావరానికి, భోగాపురంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి మట్టి, ఇసుక పెద్దఎత్తున అవసరం కావడంతో వాటిని సరఫరా చేయడానికి రాజకీయ నాయకులు పోటీ పడుతున్నారు. పెందుర్తి నేతలు అరకు, ఎస్.కోట తదితర ప్రాంతాలలో ఇసుకను తవ్వించి లారీల్లో తెప్పిస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అమ్ముకుంటున్నారు. ఈ లారీలు గమ్యస్థానాలకు వెళ్లేటపుడు మధ్యలో ఎవరూ అడ్డగించకుండా ఉండేందుకు అధికారులతోనే ప్రత్యేకంగా 'గ్రీన్ ఛానల్' ఏర్పాటు చేయించుకున్నారు.

ఆ లారీలు ఎక్కడ ఎదురైనా స్థానిక అధికారులు ఎవరూ అడ్డగించకూడదని అనధికార ఆదేశాలు కూడా జారీఅయ్యాయి. అదే విధంగా కొండలను, ప్రభుత్వ భూములను తవ్వి ఎర్రమట్టిని తరలించుకుపోతున్నారు. ఇటీవల నియోజకవర్గంలో కొందరు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. వారు గతంలో మట్టి, ఇసుక అమ్మకాల ద్వారా బాగా లాభపడ్డారు. ఇప్పుడు అవే వ్యాపారాలను నడుపుతున్నారు. వీరికి పోటీగా ఇంకెవరైనా ఇసుక తెచ్చినా, మట్టి తవ్వినా, తరలించినా ఆ వాహనాలను పట్టుకొని కేసులు పెట్టిస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు నడుపుతున్నారు. ఇటువంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అధికారులు సైతం నాయకులకు సహకరించడం విశేషం.

ఆధునిక సాంకేతికతతో తపాలా సేవలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతతో తపాలా సేవలను విస్తరించ నున్నట్టు సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ మీనా తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలను తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్టు తెలిపారు. తపాలా శాఖ మంగళవారం బీచ్ రోడ్డులోని అంబికా సీ గ్రీన్‌లో నిర్వహించిన బిజినెస్ డెవలప్‌మెంట్ కస్టమర్ మీట్ 2025 కార్యక్రమంలో ఆయన వినియోగదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ మాట్లాడుతూ తపాలా సేవలను, చివరి మైలు కనెక్టివిటీని ప్రశంసించారు. మరిన్ని మెరుగైన సేవలను అందించే అవకాశాలున్నాయన్నారు. సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ డివిజన్ కోమల్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కేవీడీ సాగర్ ప్రసంగించారు. స్పీడ్ పోస్టు, పార్శిల్స్, బీఎస్ఎన్ఎల్, డాక్‌ఘర్, జీవిత బీమా, ఆధార్ సేవలను వివరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439